రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6:18 (సోమవారం సాయంత్రం) సహర్ : 4:48 (మంగళవారం ఉదయం)

'టెన్'షన్ పడొద్దు!

- నేటి నుంచి పది పరీక్షలు
- 25,723 మంది విద్యార్థులు
- 134 కేంద్రాల ఏర్పాటు



రాజమహేంద్రవరం/సిటీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో 134 పరీక్షా కేంద్రాలలో సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.ఈ మేరకు ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం నుంచి మార్చి 31 లేదా ఏప్రిల్ 1వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో పది పరీక్షలకు 25,723 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు.రెగ్యులర్ విద్యార్థులు 24,763 మందికి బాలురు 12791 మంది, బాలికలు 11972 మంది, ప్రైవేటు విద్యార్థులు 960 మంది అందులో బాలురు 591 మంది, బాలికలు 369 మంది ఉన్నారని తెలిపారు. ఈ పరీక్షలు నిర్వహణకు 1100 మంది ఇన్విజిలేటర్లు నియమించినట్టు తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలని సూచించారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పరీక్షా కేంద్రాల కు సమీపంలో జీరాక్స్ సెంటర్లు ఉంటే వాటిని మూసివేయించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఇద్దరు ఏఎన్ఎంలతో మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షాకేంద్రాలలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా పోలీసు భద్రత ఫ్రిస్కింగ్ కోసం మహిళ పోలీసు సిబ్బందిని ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాలకు నిరంతరం విద్యుత్ సరఫరా వుండేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాలు వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసివుండాలన్నారు. పరీక్షా కేంద్రాలు వుండే పరిధిని బట్టి పంచాయితి, మునిసిపాలిటి శాఖల అధికారులు కేంద్రాల్లో తాగునీరు. శానిటేషన్ కు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో జవాబు పత్రాలను స్పీడ్ పోస్టు ద్వారా పంపిణీ చేయడానికి తగిన ఏర్పాట్లు చేశామన్నా రు. జిల్లా రవాణాశాఖ ద్వారా ప్రశ్నా జవాబు పత్రాల రవాణా చేసేందుకు అవసరమైన క్లోస్డ్ వాహనాలు, ఇతర వాహనాలు అందుబాటులో ఉంచాలని, జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి ముందస్తుగా ఇండెంట్ పెట్టారని చెప్పారు. ప్రశాంతంగా పది పరీక్షలు జరిగేందుకు శాఖల మధ్య సమన్వయం ఉండాలని ఆదేశించారు.

ఇదీ టైమ్ టేబుల్

ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్షలు నిర్వహిస్తారు. 17న ప్రథమ భాష, 19న ద్వితీయ భాష, 21న ఆంగ్లం, 24న లెక్కలు, 26న భౌతిక శాస్త్రం, 28న బయాలజీ, 31న సాంఘిక శాస్త్రం.

సమస్య ఉంటే డయల్ 72074 34999

పదో తరగతి పబ్లిక్ పరీక్షలపై కలెక్టర్ ప్రశాంతి ఇప్పటికే పలు మార్లు సమీక్షలు చేసి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడంపై సూచనలు చేశారు. తాగునీరు, అత్యవసర మందులు పరీక్ష కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచుతున్నారు. కంట్రోరూమ్‌లను ఏర్పాటు చేశారు. నిరంతర విద్యుత్, పోలీస్ బందో బస్తు ఉంటుంది.ఇక ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావడమే విద్యార్థుల వంతు. విద్యార్థులకు, పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తక్షణమే పరిష్కరించడానికి 7207434999 నెంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.జిల్లాలో కడియపులంక,నల్లజర్ల మండలం పోతవరం, రాజుపాలెం,ధవళేశ్వరం జడ్పీ, కొవ్వూరు ప్రభుత్వ భూప తిపాలెం ఏపీ రెసిడెన్షియల్ హైస్కూల్స్‌ని సమస్యాత్మక కేంద్రా లుగా గుర్తించి అదనపు భద్రత ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్దా 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. వదంతులను వ్యాప్తి చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆయా జిల్లాల ఎస్పీ లు ఇప్పటికే హెచ్చరించారు.హాల్ టికెట్లను పబ్లిక్ డొమైన్‌లో పెట్టారు.వాటిని ప్రింట్ తీసుకొని నేరుగా పరీక్షకు హాజరుకావొచ్చు. కట్టుదిట్టంగా పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

మీ నిధులు మీకే!



స్థానిక సంస్థలకు కూటమి తీపికబురు

- ప్రభుత్వం ఆర్థిక స్వేచ్ఛ
- ఎవరివి వారే ఖర్చు చేసుకోవచ్చు
- బిల్డింగ్ ప్లాన్స్ మునిసిపాలిటీలకే
- పదేళ్ల ఇబ్బందులకు చెల్లుచీటీ

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 16(ఆంధ్రజ్యోతి) : కూటమిలో స్థానికతకు పట్టం కట్టారు..ఆర్థిక స్వేచ్ఛకు ఊతమిచ్చారు. పురపాలక శాఖ మంత్రి నారాయణ చొరవతో మునిసిపాలిటీల ఎన్నో ఏళ్ల కల సాకారమైంది.రాష్ట్రంలోని నగరపాలక సంస్థలు, మునిసిపాలిటీలు,నగర పంచాయతీలకు ఆర్థిక స్వాతంత్ర్య లభించింది. ఇకపై చెత్త తొలగించాలన్నా, నీటి కుళాయి మరమ్మతు చేయాలన్నా, వీధి లైటు వేయాలన్నా, రోడ్లపై గుంతలు పూడ్చాలన్నా, నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం వైపు చూసే దయనీయ స్థితి తప్పింది. రాష్ట్రంలో పదేళ్లగా మునిసిపాలిటీల ఆదాయంలో ప్రతి పైసా సీజేఎఫ్ఎస్‌లో జమచేసేవారు. స్థానిక అవసరాలకు నిధులు రాబట్టుకోవడం అనేది సీజేఎఫ్ఎస్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండేది. పన్నుల ద్వారా మునిసిపాలిటీలకు వచ్చే ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుకునేది. స్థానిక సమస్యల పరిష్కారానికి నిధులు ఉండేవి కావు.కరోనా సమయంలో పారిశుధ్య నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేసిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు

అసెంబ్లీలో ఆర్థిక బిల్లు ఆమోదం

స్థానిక అవసరాలకు ఖర్చు చేసుకున్న నిధులు తమ ఆదాయం నుంచి విడుదల చేయాలని మునిసిపాలిటీలు రెండేళ్ల కిందట పెట్టుకున్న బిల్లులకు ఇప్పటి వరకు మోక్షం లేదు. దీంతో మునిసిపాలిటీలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్నాయి. నిజానికి 73,74 రాజ్యాంగ సవరణ ప్రకారం స్థానిక సంస్థలకు 29 అధికారాలు ఇవ్వాలని నిర్ణయం జరిగింది. ఎమ్మెల్యేలు నిధులపై ఆధిపత్యం కోసం పంచాయతీలు, మునిసిపాలిటీలకు అధికారాలు బదలాయించడం లేదు.దేశంలో దాదాపు అన్ని రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి.దేశంలో స్థానిక సంస్థలకు అధికారాలను బదలాయించిన రాష్ట్రంగా కేరళ మొదటి స్థానంలో ఉంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆ బాటలో నడుస్తోంది. మునిసిపల్ శాఖ మంత్రిగా నారాయణ బాధ్యతలు చేపట్టడంతో ఆయన పాత ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు.మునిసిపాలిటీలు బాగుపడాలంటే వాటికి ఆర్థిక స్వాతంత్ర్యం అవసరమని వాటి ఆదాయాన్ని వాటి వద్దే ఉంచాలని ఆయన ప్రభుత్వ పెద్దలను ఒప్పించగలిగారు.దీంతో మునిసిపాలిటీలకు ఆర్థిక స్వాతంత్ర్యం బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందింది. మున్సిపాల్టీలకు ఈ ఆర్థిక సంవత్సరం నుంచి పన్నుల రూపంలో వచ్చే ఆదాయం స్థానిక సంస్థల వద్దే ఉంటుంది.అవసరాలకు ఖర్చు చేసుకునే అధికారం ఉంటుంది.

2019లోనే ప్రతిపాదన..

స్థానిక సంస్థలకు ఎన్నో అవసరాలు ఉంటాయి.. నిధుల్లేకపోతే ఇబ్బందే. ఈ మేరకు మొదట 2014-19లో మునిసిపల్ శాఖ మంత్రిగా పనిచేసిన పొంగూరు నారాయణ వారి నిధులు వారివద్దే ఉంచాలనే ప్రతిపాదన ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లారు. అప్పటికే ఎన్నికల సమయం దగ్గరపడడంతో ఈ ప్రతిపాదనలు మూలనపడ్డాయి.దీంతో గత ఐదేళ్ల పాత పద్ధతే కొనసాగింది. పన్నుల రూపంలో వచ్చిన మునిసిపాలిటీల ఆదాయాన్ని గత వైసీపీ ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుకోవడంతో గడిచిన ఐదేళ్ల పురపాలికలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నాయి. మునిసిపాలిటీల్లో పనులకు కాంట్రాక్టర్లు ముందుకు వచ్చేవారు కాదు.ఈ కారణంగానే ఉమ్మడి జిల్లాలోని మునిసిపాలిటీల్లో గత ఐదేళ్లలో రోడ్లపై ఏర్పడిన గుంతలు పూడ్చలేకపోయారు.

ప్లాన్ అప్రూవల్ సరళతరం

ఈ కొత్త బిల్లులో బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్‌ను సరళతరం చేయడంతో పాటు ఉల్లంఘనలు జరిగితే చర్యలు తీసుకోవడానికి వీలుగా చట్టం చేశారు. ఇప్పటి వరకు మునిసిపాలిటీల్లో బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్‌కు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి పంపేవారు. ఇప్పుడు దాన్ని రద్దు చేశారు. మునిసిపాలిటీలే నేరుగా అప్రూవల్ ఇచ్చే వెసులుబాటు కల్పించారు. దీని వల్ల అప్రూవల్స్ వేగవంతమవుతాయి. ప్లాన్ ఉల్లంఘించి నిర్మాణాలు జరిగితే వాటిని కూల్చే అధికారం మునిసిపాలిటీలకు ఇచ్చారు. అందుకు అంగీకరిస్తూ భవన యజమాని అఫిడవిట్ ఇవ్వాల్సి ఉంటుంది. దీని వల్ల నిర్మాణాల్లో ఉల్లంఘనలు కట్టడి కానున్నాయి.

ముక్కాంశాలు!



చికెన్ ముక్క దిగదు.. మటన్ ధర మాట వినదు..

ఆదివారం వచ్చిందంటే ముక్కలేనిదే ముద్ద దిగదు.. కంచంలో చికెన్ ముక్క.. లేదంటే చేప ముక్క.. డబ్బులు ఎక్కువగా ఉంటే మటన్ ముక్క.. ఉండాల్సిందే.. అయితే బర్డ్‌ఫ్లూ కారణంగా చాలా మంది చికెన్‌కు దూరంగా ఉంటున్నారు.. కోళ్ల వ్యర్థాలను చేపలకు వేస్తున్నారని తెలిసిన వాళ్లు అవీ తినేందుకు ఇష్టపడంలేదు.. ఇక మిగిలింది మటన్ ఒకటే.. దీంతో జనం చికెన్.. ఫిష్ వదిలేసి.. మటన్ వైపు చూస్తున్నారు.. షాపుల ఎదుట క్యూ కడుతున్నారు.. మరి మటన్ అయినా నాణ్యతగా ఉంటుందా అంటే అదీ అనుమానమే.. ఎందుకంటే ఎక్కడా తనిఖీల్లేవ్.. నిల్వ మాంసం విక్రయించినా పట్టించుకునేవారే లేరు.. మేక మాంసం అని అడిగితే గొర్రె మాంసం అంటగట్టేసినా అడిగేవారు లేరు.. దీంతో వ్యాపారుల ఇష్టానుసారంగా మారిపోయింది.. ధరలపై నియంత్రణ లేదు.. తనిఖీలు లేవు.. ఇచ్చుకో.. అమ్ముకో అనే రీతిన ఉంది పరిస్థితి..

- మటన్‌లో..బోలెడు మోళీలు
- 90 శాతం గొర్రె మాంసమే విక్రయం
- బర్డ్ ఫ్లూతో తగ్గిన చికెన్ వినియోగం
- అమాంతం పెంచేస్తున్న ధరలు
- మొన్నటి వరకూ కిలో రూ.800
- ఇప్పుడు రూ.1300
- ఎక్కువ నిల్వ మాంసమే అమ్మకం
- మామూళ్ల మత్తులో..తనిఖీల్లేవ్
- ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి
- పట్టణాలు.. గ్రామాల్లోనూ ఇంతే
- ప్రజారోగ్యానికి పాతర

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

బర్డ్ ఫ్లూ నేపథ్యంలో చికెన్ తినేందుకు జనం ఇష్టపడంలేదు.. ఒకనాడు ఆదివారం వచ్చిందంటే చికెన్ షాపులు జనంతో కిటకిటలాడేవి.. మరి నేడు అటువైపు కన్నెత్తి చూసేందుకు సాహసించడంలేదు..వైద్యులు ఉడికించిన చికెన్ తిన్నా ఇబ్బందిలేదన్నా ఎందుకో దూరం పెట్టారు. చాలా తక్కువ శాతం మంది మాత్రమే ఇప్పుడిప్పుడే చికెన్ కొనుగోలు చేస్తున్నారు.. దీంతో ఇప్పుడు చూపంతా మటన్ వైపే ఉంది. దీంతో ధర అమాంతం పెంచేశారు. దీంతో మాంసాహార ప్రియులు హుష్ అంటూ నిట్టూరుస్తున్నారు.కోళ్లకు బర్డ్‌ఫ్లూ పుణ్యమాని.. మటన్ ధర అమాంతం పెరిగిపోయింది.. ఇదిలా ఉండగా సందట్లో సడేమియా అన్నట్టు మేక, గొర్రెల మాంసంపై తనిఖీలు కరువయ్యాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వినియోగం పెరిగినా ..అధిక శాతం జనం మోసపోతూనే ఉన్నారు. మటన్ ధరలు ఇంకా పెరగవచ్చనే అంచనాల నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.



90 శాతం గొర్రె మాంసమే..



మార్కెట్‌లో అందుబాటులో ఉన్న మటన్‌లో 90 శాతం గొర్రె మాంసమే ఉం టోంది. మేక మాంసం చాలా తక్కువగా లభ్యమవుతోంది. గొర్రెల పెంపకమే ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో గొర్రెల సంతలే జరుగుతాయి. మేకల సంతలు అత్యంత అరుదుగా ఉంటాయి. దీంతో మేక మాంసం అని చెబుతూ గొర్రె మాంసాన్ని విక్రయిస్తున్నారు. మేక, గొర్రె మాంసం అమ్మకాలపై ఎలాంటి తనిఖీలు, చర్యలూ, ధరల నియంత్రణా లేదు. ఒక కిలో మాంసం ఎలా ఉండాలనే నిబంధనలేమీ లేవు.దీంతో ఇష్టానుసారం అమ్మకాలు సాగిస్తున్నారు. ధరల పట్టిక షాపుల వద్ద కనిపించడం లేదు.

అమాంతం మటన్ ధర పెంపు

ఉమ్మడి తూర్పులో సుమారు 5 లక్షల గొర్రెలు, మేకలు ఉన్నాయని కాగితాలపై లెక్కలు చెబుతున్నా మటన్ ధర దూసుకుపోతోంది.. బర్డ్ ఫ్లూ కారణంగా జనం చికెన్ వైపు చూడడానికే ఇష్టపడంలేదు. దీంతో ప్రతి ఆదివారం మటన్ అమ్మకాలు పెరిగాయి.ఈ నేపథ్యంలో ఇష్టానుసారం ధరలు పెంచేస్తున్నా నియంత్రణే కరువైంది. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ స్లాటర్ హౌస్‌లలో ఆదివారం సుమారు 2 వేల గొర్రెలు, మేకలను వధిస్తున్నారు. మిగతా రోజుల్లో ఆ సంఖ్య 500 ఉంటుంది. ఉమ్మడి తూర్పులో నెలకు సుమారు 200 టన్నుల వరకూ అమ్మకాలు ఉండే మటన్ అమాంతంగా 500 టన్నుల వరకూ పెరిగింది.దీంతో ఒక్కసారిగా ధరలు పెంచేశారు.నెల కిందట వరకూ కిలో రూ.800 ఉండే ధర ఇప్పుడు గరిష్ఠంగా రూ. 1000 నుంచి రూ.1300కి చేరింది. అంటే వంద గ్రాములు కావాలంటే రూ.130 వెచ్చించాల్సిందే. ఇక శాల్తీలు కావాలంటే వామ్మో అనాల్సిందే. టిల్లీ ఒకటి రూ.200 (50-100గ్రాములు ఉం టుంది), దబ్బ(లంగ్స్) రూ.120, బోటీకి రూ.300, లివర్ కిలో రూ.1500 చెల్లించాల్సిందే. దుమ్ములను కూడా కిలో రూ.800కి అమ్ముతున్నారు. బాలింతలకు మటన్ దూరమైపోయింది.

మటన్ ధరపై నియంత్రణేది..

ఉమ్మడి జిల్లాలోని మాంసం విక్రయ దారులకు లోకల్‌గా మేకలు,గొర్రెల లభ్యత సరిపోవడం లేదు. దీంతో శ్రీశైలం, కర్నూలు జిల్లాలతో పాటు మహారాష్ట్రలోని షోలాపూర్, కర్ణాటకలోని బళ్లారి ప్రాంతాల్లో జరిగే సంతలకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు.దీంతో రవాణా చార్జీలు వినియోగదారులు భరించక తప్పడం లేదు. ధరల నియంత్రణపై యంత్రాంగం దృష్టి పెట్టడం లేదు.ఉమ్మడి జిల్లాలో 5 లక్షల వరకూ గొర్రెలు, మేకలు ఉన్నాయని లెక్కలు చెబుతున్నా వాస్తవంలో అలా లేదు.డిమాండ్ కు తగిన ఉత్పత్తి లేక వ్యాపారులు ధరలను పెంచేస్తున్నారు. అధికారులు అదుపు చేయలేకపోతున్నారు.

జబ్బు పడినవీ కొనుగోలు..

సంతల్లో జబ్బుపడిన మేకలు,గొర్రెలు 70 శాతం తక్కువకు విక్రయిస్తుంటే విక్రయదారులు కొనుగోలు చేస్తారు. రవాణాలోనే చనిపోతే కోసేసి మాంసాన్ని ఐస్ బాక్సుల్లో వేసి తీసుకొస్తారు. రాజమహేంద్రవరం జాంపేట, కాకినాడ,అమలాపురంలోని ప్రధాన మాంసాహార మార్కెట్లలో అర్ధరాత్రి ఒంటి గంట నుంచి తెల్లవారుజామున 3 గంటల మధ్యలో దింపుతారు.వధించడానికి అనువుగా లేని మేకలున్నా కమేళాలో కాస్త సొమ్ము ముట్టజెప్పి పనికానిచ్చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇక రౌండ్ సీల్‌ని కొందరు బడా వ్యాపారులు చట్టానికి విరుద్ధంగా తయారు చేయించుకొని.. షాపు వద్ద కోసేసే జంతువులకు వాళ్లే రౌండ్ సీల్ వేస్తున్నారని చెబుతున్నారు.

అధికారుల తనిఖీల్లేవ్...

మాంసాభివృద్ధికి మీట్ కార్పొరేషన్ అంటూ ఓ శాఖే ఉంది.రాష్ట్ర వ్యాప్తంగా జాయింట్ డైరెక్టర్,ఇద్దరు ముగ్గురు సిబ్బంది ఉన్నారు.ఆ శాఖ ఏం చేస్తుందనేది జగమెరిగిన సత్యం. నిబంధనల ప్రకారం పంచాయతీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు ఏర్పాటు చేసుకొనే స్లాటర్ హౌస్‌లోనే వధ జరగాలి. వధకు ముందు పశువైద్యులు పరిశీలించి ఆ జంతువుకు ఎలాంటి రోగాల్లేవని, తినడానికి అనుకూలమేనని ధ్రువపరచాలి. మాంసంపై కూడా స్టాంప్ వేస్తారు.ఎక్కడపడితే అక్కడే కోసేస్తున్నా అధికారులకు కనిపించడం లేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చూస్తే ఇప్పటి వరకూ అధికారులు తనిఖీలు చేసిన ఘటనలే లేవంటే అతిశయోక్తి కాదు.

ఏది తింటే బెటర్..

ఇటీవల అమ్మకాలు పెరగడంతో గొర్రె తోకకు నల్లరంగు పూసి మేక మాంసమని అమ్ముతున్నారు. దీనిని జాగ్రత్తగా గమనించుకోవాలి. ఒకవేళ బాగా నిల్వ చేసి ఉంటే మాంసం కొట్టే సమయంలో జిగురులా వస్తుంది. మేక మాంసంలో కొవ్వు శాతం తక్కువగా..ప్రొటీన్ ఎక్కువగా ఉంటే గొర్రెలో కొవ్వు ఎక్కువగా ప్రొటీన్ తక్కువగా ఉంటుంది.ఐరన్ కూడా మేక లో అధికం. గుండె, కొలెస్ట్రాల్ ఇబ్బందులు ఇన్న వాళ్లు గొర్రె తినకపోవడమే మంచిది. జీర్ణ సమస్యలు ఉన్నవాళ్లకు గొర్రె బెటర్. తలకాయ, కాళ్లు, శాల్తీల విషయంలో ఎవరిష్టం వారిది. తలకాయలు, కాళ్లకూ ఈ మధ్య గిరాకీ పెరిగింది.దీంతో ఐస్‌లో ఎక్కువ రోజులు నిల్వ చేసినవి అమ్మేస్తున్నారు. గొర్రె తలకాయలను మేకవని విక్రయిస్తున్నారు.తేడా తెలుసుకోవడానికి చిన్న లాజిక్ ఉంది. గొర్రె తలకాయలోని కళ్ల కింద చిన్న సొట్టలు ఉంటాయి. మేకకు ఉండవు.



చికెన్ తినలేక..!

ఇటీవల బర్డ్ ఫ్లూ కలకలం రేపిన సంగతి తెలిసిందే. దీంతో చికెన్ వినియోగం బాగా తగ్గింది. మార్కెట్‌లో మాంసం అవసరతలో 70 శాతం చికెన్ తీర్చేది. ఇప్పుడు చికెన్ వినియోగం తగ్గడం, చనిపోయిన కోళ్లను, కోళ్ల వ్యర్థాలను చేపలకు ఆహారంగా వేస్తున్నారనే విషయం బయటకు రావడం వల్ల చేపలను తినడానికీ వెనుకాడుతున్నారు. ఈ ప్రభావం మటన్‌పై పడి విపరీతంగా వినియోగం పెరిగిపోయింది. దీంతో ధరలు పెంచేశారు. చికెన్ తినలేక.. మటన్ కొనలేక సామాన్యులు అల్లాడిపోతున్నారు.

గోపాలపురంలో డయేరియా

- 10 గ్రామాల్లో భయం..భయం
- ఇప్పటి వరకూ 30 కేసులు
- మూడు రోజులుగా నమోదు
- ఇంటికి చేరిన 19 మంది
- అప్రమత్తమైన వైద్య సిబ్బంది
- 20 వైద్య బృందాల ఏర్పాటు
- అధికారులతో సీఎం సమీక్ష

గోపాలపురం,మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : గోపాలపురం మండలంలో డయేరియా విజృంభించింది.గడిచిన మూడు రోజుల్లో 10 గ్రామాల నుంచి సుమారు 30 మంది వాంతులు, విరేచనాలతో ఆసుపత్రిలో చేరారు. ప్రతి రోజూ ఎంతో కొంత మంది చేరుతూనే ఉన్నారు. ఇప్పటి వరకూ మండల కేంద్రం గోపాలపురంలో 15 మంది, వేళ్లచింతలగూడెంలో ముగ్గురు, పెద్దాపురంలో ఇద్దరు, వెంకటాయపాలెంలో ముగ్గురు, చిట్యాలలో ఇద్దరు,గుడ్డిగూడెంలో ఇద్దరు, కొవ్వూరుపాడులో ఒక్కరు, తిరుగుడుమెట్టలో ఇద్దరు డయేరియా బారిన పడ్డారు. ఆయా గ్రామాల్లో పొగాకు అధిక సంఖ్యలో సాగవుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా నలుమూలల నుంచి వందల సంఖ్యలో కార్మికులు వలసలు వస్తారు. సుమారు 3 నెలల పాటు పంట పొలాల్లోనే తాటాకు పాకలు వేసుకుని అక్కడే నివాసం ఉంటారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న పంట బోర్ల నుంచి వచ్చిన నీటిని తాగి దాహార్తిని తీర్చుకుంటారు.



కరిచర్లగూడెంలో నీటి నమూనా సేకరణ




వెంకటాయపాలెంలో బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

మరో పక్క వేసవి కావడంతో వాతావరణంలో మార్పులు.. విపరీతమైన ఎండలు వైద్య సిబ్బంది పరిగణనలోకి తీసుకుంటున్నారు. పొగాకు తోటల్లో పిచికారీ చేసిన పురుగు మందుల అవశేషాల ఘాడత పీల్చడం కూడా దీనికి ప్రధాన కారణం అని వైద్య సిబ్బంది చెపుతున్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో నమోదైన కేసులలో 19 మంది సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి చేరుకోగా మరో ఆరు గురు చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్య ఆరోగ్య శాఖాధికారులు చెబుతున్నారు.

జిల్లా అధికారుల తనిఖీ..

ఆసుపత్రి వర్గాల నుంచి జిల్లా అధికారులకు సమాచారం అందడంతో జిల్లా వైద్యాధికారులు ఆదివారం గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో డయేరియాతో చికిత్స పొందుతున్న వారి వద్దకు హుటాహుటిన వచ్చి బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత మూడు రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా చికిత్స అందించినా ఆదివారం వెలుగులోకి వచ్చింది.దీంతో డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు అన్నదేవరపేట, హుకుంపేట ఆరోగ్య కేంద్రాల వైద్యులను అప్రమత్తం చేశారు. ఆయా గ్రామాల్లో బాధితులు పరిసరాల వద్ద బ్లీచింగ్ పిచికారీ చేసి నీటి నమూనాలను పరీక్షలకు పంపిస్తామని డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు తెలిపారు. డయేరియా బాధితులను ఆదివారం రాత్రి ఆర్డీవో రాణిసుస్మిత, తహశీల్దార్ పరామర్శించి వైద్యులకు పలు సూచనలు చేశారు.

సీఎం చంద్రబాబు ఆరా



గోపాలపురంలో ప్రబలిన డయేరియాపై సీఎం చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. నివారణకు తక్షణ చర్యలు, చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. దీనిపై వైద్యాధికారులు సీఎంకి వివరిస్తూ ఇప్పటికే దాదాపు పది గ్రామాల్లో 20 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. అవసరమైతే అదనంగా డాక్టర్లను నియమిస్తామన్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని, ఎలాంటి ఇబ్బందులు లేవని అధికారులు సీఎంకి వివరించారు.



గోపాలపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

ఆసుపత్రి వైద్యురాలితో మాట్లాడుతున్న ఆర్డీవో రాణిసుస్మిత



మైన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న 3 కంప్రెషర్లు,2 టిప్పర్లు

దేచర్లలో మళ్లీ అక్రమంగా మెటల్ తవ్వకాలు

కొవ్వూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు మండలం దేచర్లలో అక్రమార్కుల ఆగడాలు ఆగడంలేదు.. ఎన్నిసార్లు దాడులు చేసినా మళ్లీ మళ్లీ అక్రమాలకు పాల్పడుతూనే ఉన్నారు. కొవ్వూరు మండలం దేచర్ల గ్రామంలోని సర్వే నెంబరు 84 వద్ద మెసర్స్ కేవీఆర్ స్టోన్ క్రషర్ ద్వారా రోడ్డు మెటల్ అక్రమంగా తవ్వుతున్నారని సమాచారం రావడంతో మైన్స్ అధికారులు ఆదివారం తనిఖీలు చేపట్టారు.తనిఖీల్లో అక్రమంగా మెటల్ తవ్వుతున్న 3 కంప్రెషర్లు,2 టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్టు మైన్స్ జిల్లా సహాయ సంచాలకులు డి.ఫణిభూషణ్ రెడ్డి తెలిపారు. సీజ్ చేసిన వాహనాలను సేఫ్ కస్టడీ కోసం కొవ్వూరు పోలీస్ స్టేషన్‌కు తరలించి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు అప్పగించామన్నారు.దాడుల్లో సర్వేయర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజాసమస్యల పరిష్కారవేదిక మీకోసం కార్యక్రమం ఈ వారం కూడా యథాతథంగా జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి పీజీఆర్ఎస్ అర్జీలను స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రత్యేక అధికారులు, జిల్లా , డివిజన్, మండల ,మునిసిపాలిటీల్లో క్షేత్రస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేశారు. అర్జీదారులు సమస్యను బట్టి హాజరై విన్నవించాలని సూచించారు. ఆయా మండల కేంద్రాల్లోనూ పీజీఆర్ఎస్ ఉంటుందన్నారు.

వేసవి వచ్చేసింది.. ఏం చేద్దాం!




వేసవి వచ్చేసింది.. ఎండలు మండిపోతున్నాయి.. మరోపక్క చెరువులు ఎండిపోతున్నాయి.. అధికారులు ఈపాటికే చెరువులు నింపడం.. దాహార్తిని తీర్చడంపై సమీక్షలు జరిపాలి.. కానీ ఇప్పటికీ అటువంటి చర్యలే లేవు.. నీటి ఎద్దడి వచ్చినా మేం ఏదో ఒక చోటకు ఎగిరెళ్లి దాహం తీర్చుకుంటాం.. మీ గురించి ఆలోచిస్తుంటేనే బాధగా ఉంది అని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టుగా.. కొంగలు.. గేదెలు కలిసి దివాన్‌చెరువులోని ఒక చెరువులో సమావేశమై వేసవిని ఎలా అధిగమించాలనేదానిపై చర్చిస్తున్నట్టు ఉంది కదూ ఈ చిత్రం..

- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

ఎగిరిపోతే.. ఎంత బావుంటుంది!



కాకినాడ రూరల్ వలసపాకల శివారులో మేత తింటూ.. గాల్లోకి ఎగురుతూ.. సందడి చేస్తున్న కొంగలు



ఎగిరిపోతే ఎంత బావుంటుంది.. అన్నట్టుగా అప్పటివరకు ఎండు చేపలు ఆహారంగా తీసుకుని.. ఆకలి తీర్చుకుని హాయిగా గగనంలోకి ఎగిరిపోతున్న కొంగలు

- ఫొటోగ్రాఫర్, కాకినాడ

భళా.. బాలిక!

ఆరేళ్లప్రాయంలోనే జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక



సాధన చేస్తున్న చిన్నారి నిత్యశ్రీ

పిఠాపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్లప్రాయంలోనే ఆ చిన్నారి విశేష ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఆర్చరీ పోటీల్లో చూపించిన ప్రతిభ ఆధారంగా అండర్ 10 పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించింది. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం ఎఫ్‌కేపాలెం గ్రామానికి చెందిన ముమ్మిడి నిత్యశ్రీ వయస్సు ఆరేళ్లు. చిన్ననాటి నుంచి ఆర్చరీపై ఆసక్తి ఉండటంతో కోచ్ పి.లక్ష్మణరావు ఆమెకు శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. ఇటీవల నిత్యశ్రీ పలు జిల్లాస్థాయి ఆర్చరీ పోటీల్లో చూపిన ప్రతిభ ఆధారంగా అండర్ 10 కేటగిరిలో అత్యధిక స్కోరు సాధించింది. ఈ చిన్నారి ప్రతిభను గుర్తించిన ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ఏపీ జట్టుకు ఎంపిక చేసింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ సమాచారం ఇచ్చారు. గుంటూరు జిల్లాలోని నాగార్జున యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగే ఆరవ జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలు అండర్ 10 ఇండియన్ రౌండ్ కేటగిరి బాలికల విభాగంలో నిత్యశ్రీ ఏపీకి ప్రాతినిధ్యం వహించనున్నది. ఈమె ప్రస్తుతం కోచ్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో శిక్షణ పొందుతోంది. నిత్యశ్రీ ఆదిత్య స్కూలులో యూకేజీ చదువుతోంది. చిన్నారిని స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.శ్రీనివాసకుమార్, ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు కె.పద్మనాభం తదితరులు అభినందించారు.

కార్మికుల భద్రత నా బాధ్యత

● మంత్రి వాసంశెట్టి సుభాష్ ● కాకినాడలో 54వ జాతీయ భద్రత వారోత్సవాలు



రైసుమిల్లుల్లో భద్రతా చర్యలపై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్

కాకినాడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కార్మికుల భద్రత తన బాధ్యత అని, వారు భద్రంగా, ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రం భద్రంగా ఉంటుందని, వారి భద్రతతోనే వికసిత్ భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ కల సాకారమవుతుందని కార్మిక ఫ్యాక్టరీస్, బాయిలర్స్ ఇన్సూరెన్స్, మెడికల్ సర్వీస్ శాఖల మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఆదివారం వాకలపూడి, పెద్దాపురం ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 54వ జాతీయ భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని కాకినాడలో నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి సుభాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిపిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కోరమండల్, ఓఎన్‌జీసీ, రిలయన్స్, జెమిని ఎడిబుల్ ఆయిల్స్ రైస్ మిల్స్ అసోసియేషన్ ఇతర వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న సిబ్బంది, కార్మికులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆధ్వర్యంలో ఎస్ఆర్ఎంటీ హాలు ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి ప్రారంభించి పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రైసు మిల్లుల్లో భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నా కార్మిక కుటుంబ సభ్యులందరినీ నేరుగా కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్మికుల భద్రత, ఆరోగ్యం పట్ల యాజమాన్యాలు మరింత బాధ్యత తీసుకోవాలన్నారు. భద్రత నియమాలను సరళమైన భాషలో అందరికీ అర్థమయ్యేలా స్థానిక భాషల్లో రూపొందించాలని మంత్రి సూచించారు. రసాయన పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు రసాయనాల పట్ల, వాటి వల్ల కలిగే ప్రమాదాల పట్ల శిక్షణ తరగతులు నిర్వహించాలని, ప్రమాదాలను పసిగట్టి నివారించే టెక్నాలజీని వాడుకోవాలన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం చంద్రబాబు వసుధా మిశ్రా నేతృత్వంలో కమిటీ వేశారని, ఆ కమిటీ రిపోర్టు ఆధారంగా అన్ని భద్రతా చర్యలను తూ.చతప్పకుండా పాటించాలన్నారు. యాజమాన్యాలు, కార్మికులు ప్రభుత్వ యంత్రాంగం కలిసి జీరో యాక్సిడెంట్ అనే నినాదంతో ముందుకెళ్లాలని మంత్రి కోరారు. కార్మికలోకపు కల్యాణానికి, శ్రామికలోకపు సౌభాగ్యానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాకినాడలో బధిర విద్యార్థులను దత్తత తీసుకోవడంతో పాటు భవన మరమ్మతులు, అదనపు గదినిర్మాణానికి ముందుకు వచ్చిన జెమినీ ఎడిబుల్స్ యాజమాన్యాన్ని మంత్రి అభినందించారు. వివిధ పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ఫ్యాక్టరీస్ డైరెక్టర్ డి.చంద్రశేఖర్ వర్మ, ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన, కాకినాడ జిల్లా అగ్నిమాపక అధికారి పీవీఎస్ రాజేశ్, జిల్లా ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ డి.రాధాకృష్ణ, ఇన్‌స్పెక్టర మురళీకృష్ణ, జిల్లా కార్మికశాఖ అదనపు కమిషనర్ బుల్లిరాణి, పరిశ్రమలశాఖ జీఎం సీహెచ్ గణపతి, జిల్లా బాయిలర్స్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

22 నుంచి గౌరీపట్నంలో నిర్మలగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు



మహోత్సవాల పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఏలూరు పీఠాధిపతి జయరావు

దేవరపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం గౌరీపట్నంలోని నిర్మలగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు ఈ నెల 22 నుంచి 25 వరకు నిర్వహించనున్నట్టు పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్, ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు తెలిపారు. ఆదివారం విలేకర్ల సమావేశంలో జయరావు మట్లాడుతూ కులాలు, మతాలు, ప్రాంతాలకతీతంగా నిర్మలగిరి పుణ్యక్షేత్రం ప్రణవిల్లుతుందన్నారు. పుణ్యక్షేత్రం ప్రారంభించి 40 ఏళ్లు అయ్యిందని, 2000 సంవత్సరంలో నిర్మలగిరి క్షేత్రంలో ప్రధాన దేవాలయం నిర్మించి 25 ఏళ్లు అయిన సందర్భంగా ఈ ఏడాది సిల్వర్ జూబ్లీ నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని, చిన్నారులు, వృద్ధులకు పాలు, మజ్జిగ అందజేస్తామన్నారు. పుణ్యక్షేత్రంలో నిత్యాన్నదానం జరుగుతుందన్నారు. భక్తులకు శాంతి కలగడానికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నామని, పుణ్యక్షేత్రం సందర్శించిన భక్తులందరికీ ధైర్యం, మనశ్శాంతి కలుగుతాయన్నారు. ఉత్సవాల నిర్వహణకు 250మంది వలంటీర్లను ఏర్పాటు చేశామని, పోలీస్ యంత్రాంగం భారీ బందోబస్తు నిర్వహిస్తారని, ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పుణ్యక్షేత్ర సందర్శనకు ఉభయ రాష్ట్రాల నుంచి పదిలక్షల వరకు భక్తులు వస్తారని తెలిపారు. జయరావును జాన్‌పీటర్, నిత్యాన్నదాన కాంట్రాక్టర్ కళ్ళేపల్లి నాగేశ్వరరావు సత్కరించారు. రెవరెండ్ ఫాదర్లు పీ.బాల, డీ.ఆరోన్, తదితరులు ఉన్నారు.

ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు మృతి

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

అల్లూరి జిల్లా గంగవరం వద్ద ఘటన



మృతులు కొర్రపు శ్రీనివాస్, గొర్లె శేఖర్ | గాయాలపాలైన శేఖర్ భార్య, కొడుకు

వై.రామవరం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా గంగవరం మండలం గంగవరం గ్రామ శివారులో 216 జాతీయ రహదారి వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ సంఘటనకు సంబంధించిన పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గంగవరం- అడ్డతీగల ప్రధాన రహదారిలో గల గంగవరం గ్రామ శివారులో ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. వై.రామవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న గొర్లె శేఖర్(30), వై.రామవరం మండలం బూరుగుపాలెంకు చెందిన కొర్రపు శ్రీనివాస్(25) అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు శేఖర్ భార్య హబీబీ, కుమారుడికి తీవ్రగాయాలు కావడంతో రంపచోడవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అడ్డతీగల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు గంగవరం ఎస్ఐ బి.వెంకటేష్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ట్రావెల్ బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

కొత్తపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కొత్తపేట సమితి రోడ్డుకు చెందిన కోనాల రాఘవులు(72)ను ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందినట్టు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. వివరాల ప్రకారం.. రాఘవులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా కుమారుడు కోనాల సత్యనారాయణ లారీ క్లీనర్‌గా పనిచేస్తూ బయట ప్రాంతంలో ఉంటున్నాడు. చూసేవారు లేక స్థానిక బోడిపాలెం వంతెన వద్ద ఉన్న ఆంజనేయస్వామి గుడి వద్ద నివసిస్తున్నాడు. శనివారం రాత్రి అమలాపురం నుంచి వచ్చే ప్రవేట్ ట్రావెల్ బస్సు రాఘవులను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కుమార్తె ఉండవల్లి వెంకటరమణ ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియాఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు.



మృతి చెందిన కోనాల రాఘవులు

కాపవరంలో ఎడ్ల పరుగు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న కుడా చైర్మన్ తుమ్మల బాబు

సామర్లకోట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం కాపవరంలో ఆదివారం గ్రామ టీడీపీ నాయకులు కుంచం శ్రీను, చోడిశెట్టి దొరబాబు, సతీష్, కుంచం బాబ్జీ ఆధ్వర్యంలో రామలింగేశ్వరా రాష్ట్ర స్థాయి సీనియర్, జూనియర్ ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 25జతల ఎడ్లు పాల్గొన్నాయి. విజేతలకు సీనియర్ విభాగంలో కుడా చైర్మన్ తుమ్మల రామ స్వామి(బాబు), జూనియర్ విభాగంలో విజేతలకు ఎమ్మెల్యే చినరాజప్ప తనయుడు రంగనాగ్ బహుమతులందజేశారు.

విజేతలు వీరే..

కోనసీమ అంబేడ్కర్ జిల్లా గుమ్మిలేరు కోరా శృతిచౌదరికి చెందిన ఎడ్లు ప్రథమ బహుమతికి ఎంపిక కావడంతో రూ.12 వేలు నగదు, షీల్డ్. కాకినాడ జిల్లా ధర్మవరం జువ్వల సత్తిబాబుకు చెందిన ఎడ్లుకు ద్వితీయ బహుమతిగా రూ.10 వేల నగదు, షీల్డ్.. తృతీయ బహుమతిగా కోనసీమ జిల్లా గుమ్మిలేరు కోరా శృతిచౌదరికి చెందిన ఎడ్లకు రూ.8వేల నగదు, షీల్డ్ బహుమతులను అందజేశారు. జూనియర్స్ విభాగంలో కాకినాడ జిల్లా సామర్లకోట పాలచర్ల కళ్యాణ్ కుమార్‌కు చెందిన ఎడ్లు ప్రథమ బహుమతిగా రూ.10 వేల నగదు, షీల్డ్.. ద్వితీయ బహుమతిగా కాకినాడ జిల్లా సామర్లకోట మండలం కాపవరం కుంచం మనోజ్‌కు చెందిన ఎడ్లకు రూ.8 వేల నగదు, షీల్డ్.. తృతీయ బహుమతిగా కాకినాడ జిల్లా కోవ్వాడ మట్టా నవనీత్ శ్రీమణి కంఠకు చెందిన ఎడ్లకు రూ.6 వేల నగదు, షీల్డ్ బహుమతులను అందజేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా యన మల కృష్ణ, చేకూరి రామ కృష్ణ, కంటే ఫణి కుమార్ వ్యవహరించారు.

మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్‌కు మాతృ వియోగం



అనంత లక్ష్మి(ఫైల్)

మండపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రుశ్రీవరప్రకాష్ తల్లి చుండ్రు అనంతలక్ష్మి(70) (అమ్ములు) ఆదివారం తెల్లవారు జామున తుదిశ్వాస విడిచారు. గతకొంత కాలం నుంచి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఆమె ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆదివారం తెల్లవారుజామున మరోసారి గుండెపోటు రావడంతో వైద్యులను పరిశీలించి మృతిచెందారని ధ్రువీకరించారు. అనంతలక్ష్మికి భర్త చుండ్రు గోవిందరాజులు, కూమార్తె లావణ్య, కూమారుడు చుండ్రుశ్రీవరప్రకాష్ ఉన్నారు. ప్రకాష్ అభి మానులు, అనుచరులు ఆయన నివాసానికి చేరుకుని ప్రగాడ సానుభూతి తెలిపారు. అనంతలక్ష్మి అంత్యక్రియలను ఆదివారం కటుంబ సభ్యులు, అభిమానుల నడుమ మండపేటలోని రుద్రభూమిలో నిర్వహించారు.

జేఎన్టీయూకేలో ముగిసిన టెక్ ఫెస్ట్



ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్‌తో నమూనాలు ప్రదర్శించిన బృందం



విద్యార్థినులు ఏర్పాటు చేసిన చేసిన ఎలక్ట్రికల్ వాహనాన్ని పరిశీలిస్తున్న వీసీ ప్రసాద్

జేఎన్టీయూకే, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూలో 2రోజులు జరిగిన జాతీయ స్థాయి సింపోజియం టెక్ ఫెస్ట్ ఆదివారం సాయంత్రం ముగిసింది. ప్రిన్సిపాల్ మోహన్ రావు అధ్యక్షతన జరిగిన ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులు, పేపర్, పోస్టర్ ప్రజంటేషన్, టెక్నికల్ క్విజ్, డ్రోన్ ప్రజంటేషన్, స్పాట్ ఈవెంట్స్‌ను సందర్శించి అభినందించారు. అనంతరం యూసీఈకే ప్రిన్సిపాల్ కార్యాలయ సెమినార్ హాల్లో రోబోటిక్ అప్లికేషన్ల కోసం కస్టమ్ ఎంబెడెడ్ బోర్డును అభివృద్ధి చేయడం అంశంపై నిర్వహించిన శిక్షణను పరిశీలించారు. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు, ప్రతిభాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, హెచ్‌వోడీలు, వైస్ ప్రిన్సిపాల్స్ వర్సిటీ, అనుబంధ కళాశాలల విద్యార్థులున్నారు.

మాటామాటా పెరిగి.. ఇటుక ముక్కలతో కొట్టుకుని!

అత్తాకోడళ్లు ఘర్షణ

గాయాలతో ఆసుపత్రిలో చేరిక

ద్రాక్షారామ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం కందులపాలెంలో శనివారం అత్తాకోడళ్ల మధ్య వాగ్వాదంతో పరస్పరం దాడి చేసుకోవడంతో ఇద్దరు గాయపడ్డారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారంతో శనివారం రాత్రి ద్రాక్షారామ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొడ్డు ఉమామహేశ్వరి తన భర్తను వదిలివేసి వేరే వివాహం చేసుకుని కాకినాడలో నివాసం ఉంటుంది. ఆమె అత్త బొడ్డు సత్యవతి కందులపాలెంలో నివసిస్తుంది. ఉమామహేశ్వరి శనివారం తన అత్త సత్యవతి ఇంటికి వచ్చి బంగారు నగలపై అత్తను ప్రశ్నించింది. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఇటుక ముక్కలతో దాడి చేసుకోవడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానిక ఏరియా ఆసుపత్రిలో చేరారు. ద్రాక్షారామ అదనపు ఎస్ఐ భుజంగరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'లోవ'లో భక్తుల కోలాహలం

రూ.4.39 లక్షల ఆదాయం


తుని రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి పుణ్యక్షేత్రం కాకినాడ జిల్లా తుని మండలంలో గల తలుపులమ్మ లోవ దేవస్థానం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో క్యూలైన్‌లు కిక్కిరిశాయి. కుటుంబ సమేతంగా తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో వంటావార్పు చేసుకుని భోజనాలు చేశారు. ఆలయానికి వివిధ విభాగాల ద్వారా రూ.4.39 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో విశ్వనాథ్‌రాజు తెలిపారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

టమోటా..ధర లేదట!

కిలో రూ.6, కోత ధర కూడా రావడంలేదని రైతుల గగ్గోలు



ఆలమూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): టమోటా రైతులకు పుట్టెడు కష్టాలు వచ్చిపడ్డాయి. ధర లేక దయనీయస్థితిలో కొట్టు మిట్టాడుతున్నారు. కోనసీమ జిల్లాలోని లంక పరివాహక ప్రాంతాల్లో టమోటా సాగు జోరుగా సాగుతుంది. ఈ పంట పూర్తిగా కాపు కొచ్చి అందుబాటులోకి వచ్చేసరికి ధర పూర్తిగా పడిపోయి కనీసం కోత కూలీ కూడా రాని దుస్థితి ఏర్పడింది. ఈ ఏడాది పంటకు అనుకూలంగా ఉండి దిగుబడులు గణనీయంగా రావడంతో ఒక్కసారిగా ధర పడిపోయి రైతులు అయోమయంలో పడ్డారు. అంతర్‌రాష్ట్ర మడికి కూరగాయల మార్కెట్లో 10 కిలోల టమోటో ధర రూ.60నుంచి 70 పలికింది. అంటే కిలో ధర రూ.6లు. ఈ ధరతో టమోటా కోసి మార్కెట్‌కు తరలించాలంటే కనీసం కిలోకి రూ.10 ఖర్చవుతుందని, దీంతో కోయడమే మానేయడం మంచిదని రైతులు వదిలేస్తున్నట్టు చెబుతున్నారు.

సాగు చేసి భారీగా నష్టపోయా



టమోటా సాగు ఆశాజనకంగా ఉంటుందని భారీగా పెటుబడి పెట్టి పంట సాగు చేశా. దిగుబడులు బాగా ఉన్నప్పటికీ కోత కూలీ రాక పంటభూమిలోనే కోయకుండా వదిలేయడం జరుగుతుంది. టమోటా సాగులో ఇంత దయనీయస్థితి మునుపెన్నడు చూడలేదు.

బి.సాయిబాబు, టమోటా రైతు, జొన్నాడ

శతాధిక వృద్ధురాలు సూర్యకాంతం మృతి



సూర్యకాంతం (ఫైల్)

అమలాపురం టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణానికి చెందిన శతాధిక వృద్ధురాలు గొవ్వాల సూర్యకాంతం (110) అనారోగ్యంతో మృతిచెందారు. మున్సిపల్ కౌన్సిలర్ గొవ్వాల రాజేష్‌కు ఆమె స్వయాన నానమ్మ. సూర్యకాంతంకు ఐదుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వారితో పాటు మనుమలు, ముని మనుమలు 52మంది ఉన్నారు. ఆదివారం సూర్యకాంతం చిత్రపటానికి పలువురు రాజకీయ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భారీ బండి..బాగుందండి!



పరిశ్రమల్లో వినియోగించే బాయిలర్‌ను మోసుకెళ్తూ తుని జాతీయ రహదారిపై ఓ భారీ ట్రాలీ వాహనం ఇలా కనిపించింది. -తుని రూరల్

కళా ప్రోత్సాహంతో నేరాల నియంత్రణ

» ఎస్పీ కిషోర్.. చిత్రకారిణి రాధారాణికి తాడోజు కిరణ్ పురస్కారం ప్రదానం


చిత్రకారిణి రాధారాణికి పురస్కారాన్ని అందజేస్తున్న ఎస్పీ కిషోర్

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి16(ఆంధ్రజ్యోతి): కళారంగాలను ప్రోత్సహించడం ద్వారా సమాజంలో నేరాలను తగ్గించగలమని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ పిలుపునిచ్చారు. చిత్రకళ, క్రీడలు, సంగీతం, పాటలు, మనిషి మానసిక ప్రవృత్తిలో మంచి మార్పును తీసుకురావడానికి దోహదం చేస్తాయని ఆయన స్పష్టం చేశారు. తాడోజు కిరణ్ స్మారక చిత్రకళా పరిషత్ అధ్యక్షుడు సన్నిధానం శాస్త్రి అధ్యక్షతన దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీలో ఆదివారం ఉదయం జరిగిన పురస్కార ప్రదానానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కళారంగం మీద మక్కువ ఉంటే ఆకలి,నిద్ర కూడా దగ్గరకు రావని, భారత జాతి గర్వించదగ్గ కళా సంస్కృతి రాజమండ్రిలో ఉందని, అయితే మరుగున పడిపోతున్న చిత్ర సంపదను భద్రపరిచి, భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతీ పౌరుడిపై ఉందని ఆయన అన్నారు. ప్రత్యేకించి, కళలకు, నేరాలను తగ్గించే శక్తి అంతర్లీనంగా ఉందని, కళలపై మక్కువ పెరిగితే ఇతర వ్యాపకాల వైపు బుద్ధి మళ్లదని తెలిపారు. ఎస్పీ కిశోర్, చిత్రకళా పరిషత్ ప్రధాన కార్యదర్శి కోసూరి చండీప్రియ, మాదేటి ప్రకాష్, చిత్రకారిణి ఎన్‌వీవీఎస్ పద్మ సమక్షంలో ప్రముఖ చిత్రకారిణి రాధారాణికి తాడోజు కిరణ్ స్మారక పురస్కారాన్ని అందజేశారు.కార్యక్రమంలో డీఎస్పీ కె.రమేష్‌బాబు, త్రీటౌన్ సీఐ వి.అప్పారావు, తాడోజు రత్నాచార్యులు, అనుప్ జైన్, గంగుల భాస్కరరావు పాల్గొన్నారు.

నూర్‌మసీద్ షెడ్డుకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం


నూర్ మసీద్ పెద్దలకు నగదు అందిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల తాడితోట మసీదులో నమాజ్ చేసుకోవడానికి షెడ్డు నిర్మాణానికి సహకరించాలని పెద్ద చేసిన విజ్ఞప్తికి స్పందించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ రూ.1.50 లక్షల నగదును అందించారు. ఆదివారం మసీదు పెద్దలకు ఎమ్మెల్యే వాసు తన కార్యాలయంలో భవాని చారిటబుల్ పక్షాన నగదును అందించారు. త్వరగా షెడ్డు నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. 2014-19లో నగరంలో మసీదుల అభివృద్ధికి, షాదీఖానాల నిర్మాణాలకు నిధులను అడ్మినిస్ట్రేషన్ శాంక్షన్‌తో పలు జీవోలు తీసుకొచ్చామని, అయితే వైసీపీ ప్రభుత్వం వాటిని నిర్లక్ష్యం చేసిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చినందున నిలిచిపోయిన అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని, వక్ఫ్ బోర్డు కమిటీలు వేస్తామని వాసు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి


నల్లమిల్లికి స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

ద్వారకా తిరుమల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆదివారం సందర్శించారు. ముందుగా ఆయన ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణలు చేసి స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయార్చకులు ఆయనకు స్వామివారి శేషవస్త్రాన్ని ఇచ్చి వేదాశీర్వచనం అందజేశారు.

విద్యార్థికి పరామర్శ

అనపర్తి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనరసాపురంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పాముకాటుకు గురై చికిత్స పొందుతున్న పదో తరగతి విద్యార్థి యాళ్ల నిస్సీని ఎమ్మెల్యే నల్లమిల్లి పరామర్శించారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆరోగ్యం మెరుగ్గా ఉండడంతో పరీక్షకు హాజరు కావచ్చన్నారు. ఎమ్మెల్యే వెంట అధికారులు, నాయకులున్నారు.

దళిత చైతన్య జయభేరి 'ధర్మన్న'


కార్యక్రమంలో మాట్లాడుతున్న అధ్యాపకురాలు విశాలక్ష్మి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కవిగా, వక్తగా, వ్యాసకర్తగా తన జీవిత ప్రస్థానాన్ని దళితుల చైతన్యం కోసమే కొనసాగించిన మహోన్నతుడు, జయభేరి సంపాదకుడు కుసుమ ధర్మన్న అని రాజమహేంద్రవరం ఎస్‌కేఆర్ డీఎడ్ కళాశాల తెలుగు శాఖాధిపతి పి.విశాలాక్షి అన్నారు. ఆదివారం కళాగౌతమి, ఎస్‌కేవీటీ ప్రభుత్వ తెలుగుశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కుసుమ ధర్మన్న జయంతి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ధర్మన్నలో ఏదో తెలియని అతీత శక్తి ఉందని, భవిష్యత్తు పరిణామాలను ఊహించి తన భావాలకు అక్షర రూపం ఇవ్వడంతోపాటు దళిత జాతిలో చైతన్యం కోసం స్వాతంత్ర్యానికి ముందే పాటలు రాశారని కొనియాడారు. కళాగౌతమి అధ్యక్షుడు పీవీబీ సంజీవరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో కొవ్వూరు సంస్కృత కళాశాల తెలుగు అధ్యాపకురాళ్లు ఎం.వాణికుమారి, కడియం శారద మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు ఏ.సరళ, ఎం.సోనీ, ఎం.శివప్రసాద్, గౌతమ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గాత్ర కచేరి

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్‌లో శ్రీ త్యాగరాజ నారాయణదాస సమితి ఆధ్వర్యంలో సంగీత వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రముఖ ఆడిటర్ విశ్వనాథం భాస్కరరామ్, సుచిత్ర భాస్కరరామ్ సౌజన్యంతో తండ్రి విశ్వనాథం అచ్యుతరామయ్య సంస్మరణార్థం ఆదివారం జరిగిన గాత్ర కచేరీ శ్రోతలను అలరించింది. ఈ సంగీత కార్యక్రమంలో గాత్రం స్మితా మాధవ్, వయోలిన్ పెరవలి నందకుమార్, మృదంగం పి.జయభాస్కర్, ఘటం కె.హరిబాబు, వాయిద్య సహకారాన్ని అందించారు. అనంతరం కళాకారులను నిర్వాహకులు సత్కరించారు.



నారాయణదాస సేవాసమితిలో గాత్ర కచేరి

ఘనంగా సత్తెమ్మ జాతర

బిక్కవోలు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎస్.పేటలోని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గిడ్డంగులో సత్తెమ్మ తల్లి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎఫ్‌సీఐలోని జట్టు కార్మికులు ఈ జాతరను ఎన్నో ఏళ్లగా నిర్వహిస్తున్నారు. అమ్మవారిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దర్శించుకుని పూజలు జరిపారు. ఈ సందర్భంగా భక్తులకు మాంసాహారంతో అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పల్లి శ్రీనివాసరెడ్డి, పీవీఎస్ ప్రసాద్‌చౌదరి, బోను సూర్యకుమార్, గుణ్ణం రమేష్‌చౌదరి, మాడా మోహన్ పాల్గొన్నారు. అలాగే కొంకుదురులోని పడాల వంశీయుల కుల దేవత సత్తెమ్మ తల్లి సంబరం ఆదివారం జరిగింది. తొలుత అమ్మవారిని గరగ నృత్యాలతో గ్రామంలో ఊరేగించారు. పడాల వంశ శీయుల ఆడపడుచులు రాకతో గ్రామం అంతా కళకళలాడింది. ఈ సందర్భంగా ఆలయం వద్ద అన్నదాన ఏర్పాట్లు చేశారు.

రంగరాజ స్వామి కల్యాణోత్సవాలకు అందని ఆహ్వానం

గొట్టిముక్కల అన్నమాచార్యుల కుటుంబీకులు ఆవేదన

కోరుకొండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తమ కుటుంబం 25 ఏళ్లగా లక్షల రూపాయలు సొంత డబ్బులు వెచ్చించి శ్రీ భూ సమేత రంగరాజ స్వామి కల్యాణోత్సవాలను జరిపిస్తుంటే అన్నవరం దేవస్థానం అధికారులు తమకు కనీసం సమాచారం కూడా అందించలేదని, ఎలాంటి ఆహ్వానపత్రం పంపలేదని పాలకొల్లు అభయ ఆంజనేయస్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు ఎస్‌టీవీ వెంకటరమణాచార్య స్వామి ఆవేదనవ్యక్తం చేశారు. కోరుకొండ అగ్రహారానికి చెందిన గొట్టిముక్కల అన్నమాచార్యుల మాస్టరు కుటుంబీకులు వందేళ్లకు పైగా రంగరాజ స్వామి కల్యాణ మహోత్సవాన్ని జరిపిస్తున్నారు. ఆయన మేనల్లుడు అల్లుడైన వెంకట రమణాచార్య స్వామి 25 ఏళ్లగా స్వామి వారి కల్యాణం జరిపిస్తున్నారు. ఇందు కోసం సమస్త ఖర్చు మాస్టరే భరిస్తారు. ఇన్నేళ్లగా స్వామి వారి కల్యాణం జరిపిస్తుంటే వెంకటరమణాచార్య స్వామి కుటుంబానికి అన్నవరం దేవస్థానం వారు ఆహ్వానపత్రిక పంపకపోవడం, కనీస సమాచారం ఇవ్వకపోవడం పట్ల కోరుకొండ పరిసరగ్రామాల్లో భక్తులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. సర్వత్రావిమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో వెంకటరమణాచార్య స్వామికి సమాచారం ఇవ్వకపోవడం, సరైన ఏర్పాట్లు చేయకపోవడం తప్పేనని ఇకపై అలా జరగకుండా చూస్తామని దేవస్థానం చైర్మన్ రంగరాజ భట్టర్‌స్వామి పేర్కొన్నారు.

నన్నయా.. మన్నించవయ్యా!

ఆదికవి నన్నయ మనవాడే అని చెప్పుకోవడం గోదారోళ్లకు మాత్రమే దక్కిన ఘనత. ఆయన పేరుతో ఇక్కడే విశ్వవిద్యాలయం కూడా ఉంది. రాజమహేంద్రవరాన్ని పాలించిన రాజరాజ నరేంద్రుడి ఆస్థాన కవిగా వినతికెక్కిన నన్నయ.. సంస్కృత మహాభారతాన్ని తెలుగులోకి అనువదించాడు. కవిత్రయంలో ఒకడు. ఇలా చెప్పుకుంటూ వెళితే ఆ కీర్తి అజరామరం. వెంకటేశ్వరా ఆనం కళా కేంద్రం ప్రాంగణంలో 2008లో ఆయనకు మందిరాన్ని నిర్మించి గౌరవించిన నగరపాలక సంస్థ.. ఆనక నిర్వహణ మరిచిపోయింది. ఆనం కళా కేంద్రంలో జరిగే కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులు, రాజకీయ నేతలు, పుర ప్రముఖులు, పెద్ద అధికారులు తరుచుగా వస్తుంటారు. కానీ ప్రవేశ ద్వారం పక్కనే ఉన్న నన్నయ మందిర దుస్థితి మాత్రం వారి కళ్లలో పడకపోవడంతో అధ్వానంగా, అపరిశుభ్రంగా మందిరం మారిపోయింది. ఎవరైనా ఆరాధింకుందామన్నా నిత్యం తాళం వేసే ఉంటోంది. ఈ దుస్థితిలో నన్నయ మందిరాన్ని చూస్తున్న జనం 'నన్నయా మన్నించయా!' అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

-రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)





కోట సత్తెమ్మకు విశేష పూజలు

నిడదవోలు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధూపహారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు జరిపారు. క్షీర, మహానివేదన చేశారు. అనంతరం ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

నీటి ఎద్దడిని అధిగమించండి

» రాజానగరం ఎంపీడీవో ఝాన్సీ
» అభివృద్ధి పనులపై సమాచారం ఇవ్వడం లేదు: సర్పంచ్‌లు
» వాడీవేడిగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఝాన్సీ

రాజానగరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వేసవిలో గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి లేకుండా అధికారులు, పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో జేప ఝాన్సీ సూచించారు. రాజానగరం మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మండారపు సీతారత్నం అధ్యక్షతన ఆదివారం వాడిగా వేడిగా జరిగింది. ఈ సమావేశంలో వైసీపీకి చెందిన రాజానగరం, పుణ్యక్షేత్రం, తోకాడ, కొత్తతుంగపాడు సర్పంచ్‌లు కుందేటి ప్రసాద్, మరుకుర్తి వెంకటేశ్వరరావు, వేగిశెట్టి పోతురాజు, కోలపాటి వెంకన్న తదితరులు మాట్లాడుతూ తమ గ్రామాల్లో ప్రభుత్వ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులు తమకు ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదని ఆరోపించారు. దీనిపై ఎంపీడీవో ఝాన్సీ స్పందిస్తూ గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనుల సమాచారాన్ని సంబంధిత సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు తెలియజేసేలా చర్యలు చేపడతామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు కల్పిస్తున్న సౌకర్యాలపై స్థానిక సర్పంచ్ కుందేటి ప్రసాద్ సూపర్‌వైజర్ దుర్గామణిని ప్రశ్నించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఆయాలను కార్యాలయాలకు తీసుకొచ్చి పనిచేయించుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత లోపిస్తోందని తాను ఇటీవల ఒక కేంద్రాన్ని సందర్శించిన సమయంలో అక్కడ దుర్వాసన వచ్చిందన్నారు. గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల సరఫరా చేస్తున్న చోడిపిండిలో నాణ్యతలోపిస్తుందని అధికారుల దృష్టికి తెచ్చారు. దీనిపై సూపర్‌వైజర్ దుర్గామణి మాట్లాడుతూ ప్రభుత్వం పోషణ వాటికి అమలుచేస్తోందని, దీని నిమిత్తం అప్పుడప్పుడు ఆయాలు కార్యాలయం వద్దకు వస్తున్నారన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అవినాష్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాలతో పాటు గోకవరం, రంగంపేట మండలాలకు సంబంధించి గోదావరి జలాలను తాగునీటిగా అందించేందుకు రూ.689 కోట్లతో వాటర్ గ్రిడ్ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు నివేదించామన్నారు. అలాగే చక్రద్వారబంధం గ్రామా నికి మంచినీటి బోరు ఏర్పాటు నిమిత్తం జిల్లా కలెక్టర్ ప్రశాంతి రూ.16.50 లక్షలు నిధులను మంజూరు చేశారన్నారు. గత ప్రభుత్వంలో జగనన్న హౌసింగ్ కాలనీలకు లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయంటూ సదరు లబ్ధిదారుల జాబితాలను మారుస్తున్నట్లు గ్రామాల్లో ప్రచారం జరుగుతోందని పుణ్యక్షేత్రం సర్పంచ్ అధికారుల దృష్టికి తెచ్చారు. పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ రీసర్వే చేసే సమయంలో సరిహద్దు రైతులకు సమాచారం ఇవ్వడం లేదని తహశీల్దార్ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో సుబ్రహ్మణ్యం, సెర్ప్ ఏపీఎం గుమ్మడి సునీత, హౌసింగ్ ఏఈ రామారావు, పంచాయతీరాజ్ ఏఈ సంప త్‌కుమార్, వైస్ ఎంపీపీ కొల్లి సత్యశ్రీ, కోడి రాఘవ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.


శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో సీతారామమూర్తి


పాలచర్లలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

'అమరజీవి'కి ఘన నివాళి

» జిల్లా రెవెన్యూ అధికారి సీతారామమూర్తి
» పొట్టి శ్రీరాములు జయంతి
» నివాళులర్పించిన పలువురు అధికారులు, నాయకులు

రాజమహేంద్రవరం సిటీ మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర సాధనకు కృషి చేసిన పొట్టి శ్రీరాములు నుంచి స్ఫూర్తి పొందాలని జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఆయన విచ్చేసి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన గొప్పవ్యక్తి పొట్టి శ్రీరాములని, 1901 మార్చి 16న నెల్లూరు జిల్లా పడమటిపల్లిలో ఆయన జన్మించారని, అమరజీవి త్యాగాలను స్మరిస్తూ ఏటా రాష్ట్ర ప్రభుత్వం ఆయన జన్మదినాన్ని రాష్ట్రవేడుకగా జరుపుతుందన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి బి.శశాంక, కలెక్టరేట్, ఇతర కార్యాలయాల అధికారులు, ఉద్యోగులు, ఏబీసీ డబ్ల్యూఏవోలు ముత్యాల సుబ్బారావు, పి.రామకృష్ణ, హెచ్‌డబ్ల్యూవోలు పాల్గొన్నారు.

రాజానగరం: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఆర్యవైశ్య మండల సంఘం, పొట్టి శ్రీరాములు స్మృతి పరిరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. తొలుత పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు మండవిల్లి వెంకన్నబాబు, స్మృతి పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు గ్రంధి నానబ్బులు, గ్రంధి రాజా, దవులూరి గిరి తదితరులు పాల్గొన్నారు.

దివాన్‌చెరువు: పాలచర్లలో ఆర్యవైశ్య సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జోన్ కన్వీనర్ తమ్మన సూరిబాబు ఆధ్వర్యంలో జరిగిన పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమానికి సంఘం జిల్లా జోనల్ చైర్మన్ మండవిల్లి వెంకన్న బాబు విచ్చేసి పొట్టి శ్రీరాములు, పూజ్య బాపూజీ విగ్రహాలకు పూలమాలలతో నివాళులర్పించారు. మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గ్రంధి నానబ్బు, గంగిశెట్టి సోమేశ్వరరావు, వేమగిరి కృష్ణ, వి.తాతారావు తదితర్లు పాల్గొన్నారు.

రంగంపేట: స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ మండవిల్లి గుప్త మాట్లాడుతూ కుల వివక్ష అధికంగా ఉన్న ఆ రోజుల్లో సామాజిక రుగ్మతలపై పోరాటం చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీరాములు అని, ఆయన త్యాగం ఆదర్శనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండవిల్లి సత్యనారాయణమూర్తి రాజా, గళ్లా నారాయణ రావు, గళ్లా శ్రీనివాస్, కుసుమంచి రాజేష్, లైబ్రేరియన్ ఎన్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.


రాజానగరంలో శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


రంగంపేటలో శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

» హాజరుకానున్న 831 మంది విద్యార్థులు
» అనపర్తిలో 4 పరీక్ష కేంద్రాలు
» మండల విద్యాశాఖాధికారి సత్తిరెడ్డి


అనపర్తిలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల

అనపర్తి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17 నుంచి జరుగనున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి ఆదివారం విలేకరులకు తెలిపారు. మండలంలో గురుకుల పాఠశాలతో కలిసి తొమ్మిది పాఠశాలలు ఉండగా వీటిలో అనపర్తిలోని బాలుర ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాల, కుతుకులూరు జడ్పీ పాఠశాల, ఎల్ఎన్‌పురం గురుకుల పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. మండల పరిధిలో మొత్తం 831 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. పరీక్షలు నిర్వహించే పాఠశాలల్లో అన్ని ఏర్పాట్లు చేశామని ఎంఈవో అన్నారు.

మూడు పరీక్ష కేంద్రాలు

బిక్కవోలు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 1వ తేదీ వరకూ మండలంలో నిర్వహించే పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంఈవో సీహెచ్ వీవీ సత్యనారాయణ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 588 మంది, ప్రైవేటు విద్యార్థులు 19 మంది పరీక్షలు రాయనున్నారన్నారు. వీరి కోసం బిక్కవోలు, పందలపాక, బలభద్రపురం ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

1261 మంది విద్యార్థులు

కోరుకొండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17 నుంచి ప్రారంభయ్యే పదో తరగతి పరీక్షల నిర్వహణ కోసం మండలంలో 7 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశామని మండల విద్యాశాఖాధికారి టి.కుశలవ దొర తెలిపారు. పరీక్షలకు ప్రభుత్వ పాఠశాలలల నుంచి 440 మంది బాలురు, 444 మంది బాలికలు, ప్రైవేట్ పాఠశాలల నుంచి 178 మంది బాలురు, 199 మంది బాలికలు, పరీక్షలు రాయనున్నారన్నారు. మొత్తం 1261 మంది విద్యార్థులకు గాను కోరుకొండలో 3 పరీక్షా కేంద్రాలు, గాదరాడ, దోసకాయలపల్లి, శ్రీరంగపట్నం, కోటికేశవరం హైస్కూళ్లలో పరీక్ష కేంద్రాను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఏడుగురిని డిపార్టుమెంట్ ఆఫీసర్లు గాను, మరో ఏడుగురిని చీఫ్ సూపరింటెండెంట్‌లు గాను, 94 మందిని ఇన్విజిలేటర్లుగా నియమించామన్నారు. పరీక్షా కేంద్రం వద్ద ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఫర్నీచర్, లైట్లు, తాగు నీరు ఏర్పాటు చేసినట్టు ఎంఈవో కుశలవ దొర తెలిపారు.

ఖోఖో రాష్ట్ర జట్లకు క్రీడాకారుల ఎంపిక

పంగులూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనేందుకు ఎంపికైన రాష్ట్ర స్త్రీ, పురుష జట్లు పోటీల్లో రాణించాలని రాష్ట్ర ఖోఖో అసోషియేషన్ చైర్మన్ డాక్టర్ బీసీహెచ్ గరటయ్య అన్నారు. పంగులూరు ఎంఎస్‌ఆర్‌అండ్ బీఎస్‌ఎం జూనియర్ కళాశాలలోని ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో రాష్ట్ర స్త్రీ, పురుష ఖోఖో జట్ల ఎంపిక ఆదివారం జరిగింది. ఈ ఎంపిక కార్యక్రమంలో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి పురుష క్రీడాకారులు 95 మంది, స్త్రీ క్రీడాకారులు 75 మంది పాల్గొన్నారు. వీరిలో 15 మంది పురుష క్రీడాకారులను, 15 మంది స్త్రీ క్రీడాకారులతో పాటు ముగ్గురు స్టాండ్ బైగా చేశారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి పురుషుల్లో ఎం.శాయివెంకట్ కె.శివశంకర్, స్త్రీలలో పీసీహెచ్.అనూష డి.నందిని, జి.పావని(స్టాండ్ బైగా) ఎంపికైనట్టు రాష్ట్ర కార్యదర్శి సీతారామిరెడ్డి తెలిపారు.

ప్రశాంతంగా ఇగ్నో ప్రవేశ పరీక్షలు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) స్టడీసెంటర్‌లో ఆదివారం బీఎడ్, నర్సింగ్ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం బీఎడ్ ప్రవేశ పరీక్ష నిర్వహించగా, సాయంత్రం నర్సింగ్ ప్రవేశపరీక్ష జరిపారు. విశాఖపట్నం ఇగ్నో ప్రాంతీయ సంచాలకుడు ఈ.కృష్ణారావు పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించి విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడారు. రాజమహేంద్రవరం కేంద్ర సమన్వయకర్త ఎంఆర్ గౌతమ్ పరీక్షల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జేగురుపాడులో చలివేంద్రం


మజ్జిగ పంపిణీ చేస్తున్న డాక్టర్ కిరణ్

కడియం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): వేసవిలో బాటసారులు దాహార్తిని తీర్చడంలో చలివేంద్రాలు కీలకమని టీడీపీ హెల్త్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ అన్నారు. జేగురుపాడు వంతెన వద్ద పెనుమర్తి వెంకట్రావు సహాయంతో మర్రెడి రమేష్, పాతూరి రాజేష్, నాగిరెడ్డి రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ చేశారు.కార్యక్రమంలో నాయకులు ప్రత్తిపాటి రామారావుచౌదరి, రెడ్డి రామారావు, ముత్యాల రాంబాబు, ముత్యాల బుల్లయ్యచౌదరి, కర్రి చిన్నబాబు పాల్గొన్నారు.

బీజేపీ ఐదో మండల కమిటీ ఏకగ్రీవం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా రాజమహేంద్రవరం సిటీలోని 5 వ మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైందని జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తెలిపారు. ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా కమలేష్‌కుమార్ జైన్, ఇతర కమిటీ ఎన్నికైందని తెలిపారు. నూతన కమిటీ బీజేపీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారి ప్రసాద్, లలిత్ కుమార్ జైన్, కురగంటి సతీష్, అమలాపురం ఇన్‌చార్జి రామ్మోహనరావు, రొంగల గోపి, పిల్లాడి రుద్రయ్య పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటేశ్వర నగర్ ఆధ్వర్యంలో డాక్టర్ వలేపల్లి రామకృష్ణ పర్యవేక్షణలో ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వృద్ధాప్యంలో వచ్చే ఆరోగ్య సమస్యలు, వాటికి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. డాక్టర్ రామకృష్ణను క్లబ్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వుండవల్లి సత్యనారాయణ, భాను ప్రసాద్, వాసు, వాసిరెడ్డి లక్ష్మీనారాయణ, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

షిర్డి సాయిబాబా మందిర వార్షికోత్సవాలు

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్ రోడ్ శ్రీ వెంకటేశ్వర ఫైనాన్స్ ప్రాంగణంలోని షిర్డి సాయి మందిర వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం మహాభారతంపై జటావల్లభుల రామమూర్తి ప్రవచనం శ్రోతలను అకట్టుకుంది. రామమూర్తిని, నిర్వాహకులు అద్దంకి వెంకట ప్రభాకర శ్రీరామమూర్తి, రావిపాటి మదన గోపాలస్వామి అభినందించారు. దెందులూరి శ్యామ్‌కుమార్ అర్చకత్వంలో సాయిబాబాకు 13రకాల పూలతో లక్ష పుష్పార్చన నిర్వహించారు.

సత్యదేవ నర్సరీని సందర్శించిన జోగి నాయుడు కుటుంబం

కడియం మార్చి 16(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యదేవ నర్సరీ(పుల్లా చంటియ్య) ని ఆదివారం సాయంత్రం సినీ నటుడు జోగి నాయుడు కుటుంబం సందర్శించింది. ఈ సందర్భంగా నర్సరీ ఎండీ పుల్లా పెద్ద సత్యనారాయణ మొక్కతో స్వాగతం పలికారు. నర్సరీలో ఇండోర్ మొక్కలోని రకాల గురించి, ముఖ్యంగా క్యాట్‌ప్లాంట్, ఎర్రచిత్రమాల, కనంగా కీర్కి, నల్లమల్ల అడవిలో ఉండే దేవదార్ మొక్కల గురించి జోగినాయుడుకు సత్యనారాయణ వివరించారు. ఈ సందర్భంగా నర్సరీల అందాలను నాయుడు కొనియాడారు. ఈ సందర్భంగా వారి వెంట నర్సరీ రైతులున్నారు.



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:18 (సోమవారం సాయంత్రం) సహర్: 4:48 (మంగళవారం ఉదయం)

'టెన్'షన్ పడొద్దు!

- నేటి నుంచి పది పరీక్షలు
- 25,723 మంది విద్యార్థులు
- 134 కేంద్రాల ఏర్పాటు



రాజమహేంద్రవరం/సిటీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో 134 పరీక్షా కేంద్రాలలో సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.ఈ మేరకు ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం నుంచి మార్చి 31 లేదా ఏప్రిల్ 1వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో పది పరీక్షలకు 25,723 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు.రెగ్యులర్ విద్యార్థులు 24,763 మందికి బాలురు 12791 మంది, బాలికలు 11972 మంది, ప్రైవేటు విద్యార్థులు 960 మంది అందులో బాలురు 591 మంది, బాలికలు 369 మంది ఉన్నారని తెలిపారు. ఈ పరీక్షలు నిర్వహణకు 1100 మంది ఇన్విజిలేటర్లు నియమించినట్టు తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలని సూచించారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పీరీక్షా కేంద్రాల కు సమీపంలో జీరాక్స్ సెంటర్లు ఉంటే వాటిని మూసివేయించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఇద్దరు ఏఎన్‌ఎంలతో మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షాకేంద్రాలలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా పోలీసు భద్రత ఫ్రిస్కింగ్ కోసం మహిళ పోలీసు సిబ్బందిని ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాలకు నిరంతరం విద్యుత్ సరఫరా వుండేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాలు వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసివుండాలన్నారు. పరీక్షా కేంద్రాలు వుండే పరిధిని బట్టి పంచాయితి, మునిసిపాలిటి శాఖల అధికారులు కేంద్రాల్లో తాగునీరు. శానిటేషన్ కు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో జవాబు పత్రాలను స్పీడ్ పోస్టు ద్వారా పంపిణీ చేయడానికి తగిన ఏర్పాట్లు చేశామన్నా రు. జిల్లా రవాణాశాఖ ద్వారా ప్రశ్నా జవాబు పత్రాల రవాణా చేసేందుకు అవసరమైన క్లోజ్డ్ వాహనాలు, ఇతర వాహనాలు అందుబాటులో ఉంచాలని, జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి ముందస్తుగా ఇండెంట్ పెట్టారని చెప్పారు. ప్రశాంతంగా పది పరీక్షలు జరిగేందుకు శాఖల మధ్య సమన్వయం ఉండాలని ఆదేశించారు.

ఇదీ టైమ్ టేబుల్

ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్షలు నిర్వహిస్తారు. 17న ప్రథమ భాష, 19న ద్వితీయ భాష, 21న ఆంగ్లం, 24న లెక్కలు, 26న భౌతిక శాస్త్రం, 28న బయాలజీ, 31న సాంఘిక శాస్త్రం.

సమస్య ఉంటే డయల్ 72074 34999

పదో తరగతి పబ్లిక్ పరీక్షలపై కలెక్టర్ ప్రశాంతి ఇప్పటికే పలు మార్లు సమీక్షలు చేసి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడంపై సూచనలు చేశారు. తాగునీరు, అత్యవసర మందులు పరీక్ష కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచుతున్నారు. కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. నిరంతర విద్యుత్, పోలీస్ బందో బస్తు ఉంటుంది.ఇక ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావడమే విద్యార్థుల వంతు. విద్యార్థులకు, పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తక్షణమే పరిష్కరించడానికి 7207434999 నెంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.జిల్లాలో కడియపులంక,నల్లజర్ల మండలం పోతవరం, రాజుపాలెం,ధవళేశ్వరం జడ్పీ, కొవ్వూరు ప్రభుత్వ, భూప తిపాలెం ఏపీ రెసిడెన్షియల్ హైస్కూల్స్‌ని సమస్యాత్మక కేంద్రా లుగా గుర్తించి అదనపు భద్రత ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్దా 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. వదంతులను వ్యాప్తి చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆయా జిల్లాల ఎస్పీ లు ఇప్పటికే హెచ్చరించారు.హాల్ టికెట్లను పబ్లిక్ డొమైన్‌లో పెట్టారు.వాటిని ప్రింట్ తీసుకొని నేరుగా పరీక్షకు హాజరుకావొచ్చు. కట్టుదిట్టంగా పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు.



మీ నిధులు మీకే!

స్థానిక సంస్థలకు కూటమి తీపికబురు

- ప్రభుత్వం ఆర్థిక స్వేచ్ఛ
- ఎవరివి వారే ఖర్చు చేసుకోవచ్చు
- బిల్డింగ్ ప్లాన్స్ మునిసిపాలిటీలకే
- పదేళ్ల ఇబ్బందులకు చెల్లుచీటీ

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 16(ఆంధ్రజ్యోతి) : కూటమిలో స్థానికతకు పట్టం కట్టారు..ఆర్థిక స్వేచ్ఛకు ఊతమిచ్చారు. పురపాలక శాఖ మంత్రి నారాయణ చొరవతో మునిసిపాలిటీల ఎన్నో ఏళ్ల కల సాకారమైంది.రాష్ట్రంలోని నగరపాలక సంస్థలు, మునిసిపాలిటీలు,నగర పంచాయతీలకు ఆర్థిక స్వాతంత్ర్య లభించింది. ఇకపై చెత్త తొలగించాలన్నా, నీటి కుళాయి మరమ్మతు చేయాలన్నా, వీధి లైటు వేయాలన్నా, రోడ్లపై గుంతలు పూడ్చాలన్నా, నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం వైపు చూసే దయనీయ స్థితి తప్పింది. రాష్ట్రంలో పదేళ్లగా మునిసిపాలిటీల ఆదాయంలో ప్రతి పైసా సీజేఎఫ్‌ఎస్‌లో జమచేసేవారు. స్థానిక అవసరాలకు నిధులు రాబట్టుకోవడం అనేది సీజేఎఫ్‌ఎస్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండేది. పన్నుల ద్వారా మునిసిపాలిటీలకు వచ్చే ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుకునేది. స్థానిక సమస్యల పరిష్కారానికి నిధులు ఉండేవి కావు.కరోనా సమయంలో పారిశుధ్య నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేసిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు

అసెంబ్లీలో ఆర్థిక బిల్లు ఆమోదం

స్థానిక అవసరాలకు ఖర్చు చేసుకున్న నిధులు తమ ఆదాయం నుంచి విడుదల చేయాలని మునిసిపాలిటీలు రెండేళ్ల కిందట పెట్టుకున్న బిల్లులకు ఇప్పటి వరకు మోక్షం లేదు. దీంతో మునిసిపాలిటీలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్నాయి. నిజానికి 73,74 రాజ్యాంగ సవరణ ప్రకారం స్థానిక సంస్థలకు 29 అధికారాలు ఇవ్వాలని నిర్ణయం జరిగింది. ఎమ్మెల్యేలు నిధులపై ఆధిపత్యం కోసం పంచాయతీలు, మునిసిపాలిటీలకు అధికారాలు బదలాయించడం లేదు.దేశంలో దాదాపు అన్ని రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి.దేశంలో స్థానిక సంస్థలకు అధికారాలను బదలాయించిన రాష్ట్రంగా కేరళ మొదటి స్థానంలో ఉంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆ బాటలో నడుస్తోంది. మునిసిపల్ శాఖ మంత్రిగా నారాయణ బాధ్యతలు చేపట్టడంతో ఆయన పాత ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు.మునిసిపాలిటీలు బాగుపడాలంటే వాటికి ఆర్థిక స్వాతంత్ర్యం అవసరమని వాటి ఆదాయాన్ని వాటి వద్దే ఉంచాలని ఆయన ప్రభుత్వ పెద్దలను ఒప్పించగలిగారు.దీంతో మునిసిపాలిటీలకు ఆర్థిక స్వాతంత్ర్యం బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందింది. మున్సిపాల్టీలకు ఈ ఆర్థిక సంవత్సరం నుంచి పన్నుల రూపంలో వచ్చే ఆదాయం స్థానిక సంస్థల వద్దే ఉంటుంది.అవసరాలకు ఖర్చు చేసుకునే అధికారం ఉంటుంది.

2019లోనే ప్రతిపాదన..

స్థానిక సంస్థలకు ఎన్నో అవసరాలు ఉంటాయి.. నిధుల్లేకపోతే ఇబ్బందే. ఈ మేరకు మొదట 2014-19లో మునిసిపల్ శాఖ మంత్రిగా పనిచేసిన పొంగూరు నారాయణ వారి నిధులు వారివద్దే ఉంచాలనే ప్రతిపాదన ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లారు. అప్పటికే ఎన్నికల సమయం దగ్గరపడడంతో ఈ ప్రతిపాదనలు మూలనపడ్డాయి.దీంతో గత ఐదేళ్లు పాత పద్ధతే కొనసాగింది. పన్నుల రూపంలో వచ్చిన మునిసిపాలిటీల ఆదాయాన్ని గత వైసీపీ ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుకోవడంతో గడిచిన ఐదేళ్లు పురపాలికలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నాయి. మునిసిపాలిటీల్లో పనులకు కాంట్రాక్టర్లు ముందుకు వచ్చేవారు కాదు.ఈ కారణంగానే ఉమ్మడి జిల్లాలోని మునిసిపాలిటీల్లో గత ఐదేళ్లలో రోడ్లపై ఏర్పడిన గుంతలు పూడ్చలేకపోయారు.

ప్లాన్ అప్రూవల్ సరళతరం

ఈ కొత్త బిల్లులో బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్‌ను సరళతరం చేయడంతో పాటు ఉల్లంఘనలు జరిగితే చర్యలు తీసుకోవడానికి వీలుగా చట్టం చేశారు. ఇప్పటి వరకు మునిసిపాలిటీల్లో బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్‌కు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి పంపేవారు. ఇప్పుడు దాన్ని రద్దు చేశారు. మునిసిపాలిటీలే నేరుగా అప్రూవల్ ఇచ్చే వెసులుబాటు కల్పించారు. దీని వల్ల అప్రూవల్స్ వేగవంతమవుతాయి. ప్లాన్ ఉల్లంఘించి నిర్మాణాలు జరిగితే వాటిని కూల్చే అధికారం మునిసిపాలిటీలకు ఇచ్చారు. అందుకు అంగీకరిస్తూ భవన యజమాని అఫిడవిట్ ఇవ్వాల్సి ఉంటుంది. దీని వల్ల నిర్మాణాల్లో ఉల్లంఘనలు కట్టడి కానున్నాయి.



ముక్కాంశాలు!

చికెన్ ముక్క దిగదు.. మటన్ ధర మాట వినదు..

ఆదివారం వచ్చిందంటే ముక్కలేనిదే ముద్ద దిగదు.. కంచంలో చికెన్ ముక్క.. లేదంటే చేప ముక్క.. డబ్బులు ఎక్కువగా ఉంటే మటన్ ముక్క.. ఉండాల్సిందే.. అయితే బర్డ్‌ఫ్లూ కారణంగా చాలా మంది చికెన్‌కు దూరంగా ఉంటున్నారు.. కోళ్ల వ్యర్థాలను చేపలకు వేస్తున్నారని తెలిసిన వాళ్లు అవీ తినేందుకు ఇష్టపడంలేదు.. ఇక మిగిలింది మటన్ ఒకటే.. దీంతో జనం చికెన్.. ఫిష్ వదిలేసి.. మటన్ వైపు చూస్తున్నారు.. షాపుల ఎదుట క్యూ కడుతున్నారు.. మరి మటన్ అయినా నాణ్యతగా ఉంటుందా అంటే అదీ అనుమానమే.. ఎందుకంటే ఎక్కడా తనిఖీల్లేవ్.. నిల్వ మాంసం విక్రయించినా పట్టించుకునేవారే లేరు.. మేక మాంసం అని అడిగితే గొర్రె మాంసం అంటగట్టేసినా అడిగేవారు లేరు.. దీంతో వ్యాపారుల ఇష్టానుసారంగా మారిపోయింది.. ధరలపై నియంత్రణ లేదు.. తనిఖీలు లేవు.. ఇచ్చుకో.. అమ్ముకో అనే రీతిన ఉంది పరిస్థితి..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

బర్డ్ ఫ్లూ నేపథ్యంలో చికెన్ తినేందుకు జనం ఇష్టపడంలేదు.. ఒకనాడు ఆదివారం వచ్చిందంటే చికెన్ షాపులు జనంతో కిటకిటలాడేవి.. మరి నేడు అటువైపు కన్నెత్తి చూసేందుకు సాహసించడంలేదు..వైద్యులు ఉడికించిన చికెన్ తిన్నా ఇబ్బందిలేదన్నా ఎందుకో దూరం పెట్టారు. చాలా తక్కువ శాతం మంది మాత్రమే ఇప్పుడిప్పుడే చికెన్ కొనుగోలు చేస్తున్నారు.. దీంతో ఇప్పుడు చూపంతా మటన్ వైపే ఉంది. దీంతో ధర అమాంతం పెంచేశారు. దీంతో మాంసాహార ప్రియులు హుష్ అంటూ నిట్టూరుస్తున్నారు.కోళ్లకు బర్డ్‌ఫ్లూ పుణ్యమాని.. మటన్ ధర అమాంతం పెరిగిపోయింది.. ఇదిలా ఉండగా సందట్లో సడేమియా అన్నట్టు మేక, గొర్రెల మాంసంపై తనిఖీలు కరువయ్యాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వినియోగం పెరిగినా ..అధిక శాతం జనం మోసపోతూనే ఉన్నారు. మటన్ ధరలు ఇంకా పెరగవచ్చనే అంచనాల నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.



90 శాతం గొర్రె మాంసమే..



మార్కెట్‌లో అందుబాటులో ఉన్న మటన్‌లో 90 శాతం గొర్రె మాంసమే ఉం టోంది. మేక మాంసం చాలా తక్కువగా లభ్యమవుతోంది. గొర్రెల పెంపకమే ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో గొర్రెల సంతలే జరుగుతాయి. మేకల సంతలు అత్యంత అరుదుగా ఉంటాయి. దీంతో మేక మాంసం అని చెబుతూ గొర్రె మాంసాన్ని విక్రయిస్తున్నారు. మేక, గొర్రె మాంసం అమ్మకాలపై ఎలాంటి తనిఖీలు, చర్యలూ, ధరల నియంత్రణా లేదు. ఒక కిలో మాంసం ఎలా ఉండాలనే నిబంధనలేమీ లేవు.దీంతో ఇష్టానుసారం అమ్మకాలు సాగిస్తున్నారు. ధరల పట్టిక షాపుల వద్ద కనిపించడం లేదు.

అమాంతం మటన్ ధర పెంపు

ఉమ్మడి తూర్పులో సుమారు 5 లక్షల గొర్రెలు, మేకలు ఉన్నాయని కాగితాలపై లెక్కలు చెబుతున్నా మటన్ ధర దూసుకుపోతోంది.. బర్డ్ ఫ్లూ కారణంగా జనం చికెన్ వైపు చూడడానికే ఇష్టపడడంలేదు. దీంతో ప్రతి ఆదివారం మటన్ అమ్మకాలు పెరిగాయి.ఈ నేపథ్యంలో ఇష్టానుసారం ధరలు పెంచేస్తున్నా నియంత్రణే కరువైంది. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ స్లాటర్ హౌస్‌లలో ఆదివారం సుమారు 2 వేల గొర్రెలు, మేకలను వధిస్తున్నారు. మిగతా రోజుల్లో ఆ సంఖ్య 500 ఉంటుంది. ఉమ్మడి తూర్పులో నెలకు సుమారు 200 టన్నుల వరకూ అమ్మకాలు ఉండే మటన్ అమాంతంగా 500 టన్నుల వరకూ పెరిగింది.దీంతో ఒక్కసారిగా ధరలు పెంచేశారు.నెల కిందట వరకూ కిలో రూ.800 ఉండే ధర ఇప్పుడు గరిష్ఠంగా రూ. 1000 నుంచి రూ.1300కి చేరింది. అంటే వంద గ్రాములు కావాలంటే రూ.130 వెచ్చించాల్సిందే. ఇక శాల్తీలు కావాలంటే వామ్మో అనాల్సిందే. టిల్లీ ఒకటి రూ.200 (50-100గ్రాములు ఉం టుంది), దబ్బ(లంగ్స్) రూ.120, బోటీకి రూ.300, లివర్ కిలో రూ.1500 చెల్లించాల్సిందే. దుమ్ములను కూడా కిలో రూ.800కి అమ్ముతున్నారు. బాలింతలకు మటన్ దూరమైపోయింది.

మటన్ ధరపై నియంత్రణేది..

ఉమ్మడి జిల్లాలోని మాంసం విక్రయ దారులకు లోకల్‌గా మేకలు,గొర్రెల లభ్యత సరిపోవడం లేదు. దీంతో శ్రీశైలం, కర్నూలు జిల్లాలతో పాటు మహారాష్ట్రలోని షోలాపూర్, కర్ణాటకలోని బళ్లారి ప్రాంతాల్లో జరిగే సంతలకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు.దీంతో రవాణా చార్జీలు వినియోగదారులు భరించక తప్పడం లేదు. ధరల నియంత్రణపై యంత్రాంగం దృష్టి పెట్టడం లేదు.ఉమ్మడి జిల్లాలో 5 లక్షల వరకూ గొర్రెలు, మేకలు ఉన్నాయని లెక్కలు చెబుతున్నా వాస్తవంలో అలా లేదు.డిమాండ్ కు తగిన ఉత్పత్తి లేక వ్యాపారులు ధరలను పెంచేస్తున్నారు. అధికారులు అదుపు చేయలేకపోతున్నారు.

జబ్బు పడినవీ కొనుగోలు..

సంతల్లో జబ్బుపడిన మేకలు,గొర్రెలు 70 శాతం తక్కువకు విక్రయిస్తుంటే విక్రయదారులు కొనుగోలు చేస్తారు. రవాణాలోనే చనిపోతే కోసేసి మాంసాన్ని ఐస్ బాక్సుల్లో వేసి తీసుకొస్తారు. రాజమహేంద్రవరం జాంపేట, కాకినాడ,అమలాపురంలోని ప్రధాన మాంసాహార మార్కెట్లలో అర్ధరాత్రి ఒంటి గంట నుంచి తెల్లవారుజామున 3 గంటల మధ్యలో దింపుతారు.వధించడానికి అనువుగా లేని మేకలున్నా కమేళాలో కాస్త సొమ్ము ముట్టజెప్పి పనికానిచ్చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇక రౌండ్ సీల్‌ని కొందరు బడా వ్యాపారులు చట్టానికి విరుద్ధంగా తయారు చేయించుకొని.. షాపు వద్ద కోసేసే జంతువులకు వాళ్లే రౌండ్ సీల్ వేస్తున్నారని చెబుతున్నారు.

అధికారుల తనిఖీల్లేవ్...

మాంసాభివృద్ధికి మీట్ కార్పొరేషన్ అం టూ ఓ శాఖే ఉంది.రాష్ట్ర వ్యాప్తంగా జాయింట్ డైరెక్టర్,ఇద్దరు ముగ్గురు సిబ్బంది ఉన్నారు.ఆ శాఖ ఏం చేస్తుందనేది జగమెరిగిన సత్యం. నిబంధనల ప్రకారం పంచాయతీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు ఏర్పాటు చేసుకొనే స్లాటర్ హౌస్‌లోనే వధ జరగాలి. వధకు ముందు పశువైద్యులు పరిశీలించి ఆ జంతువుకు ఎలాంటి రోగాల్లేవని, తినడానికి అనుకూలమేనని ధ్రువపరచాలి. మాంసంపై కూడా స్టాంప్ వేస్తారు.ఎక్కడపడితే అక్కడే కోసేస్తున్నా అధికారులకు కనిపించడం లేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చూస్తే ఇప్పటి వరకూ అధికారులు తనిఖీలు చేసిన ఘటనలే లేవంటే అతిశయోక్తి కాదు.

ఏది తింటే బెటర్..

ఇటీవల అమ్మకాలు పెరగడంతో గొర్రె తోకకు నల్లరంగు పూసి మేక మాంసమని అమ్ముతున్నారు. దీనిని జాగ్రత్తగా గమనించుకోవాలి. ఒకవేళ బాగా నిల్వ చేసి ఉంటే మాంసం కొట్టే సమయంలో జిగురులా వస్తుంది. మేక మాంసంలో కొవ్వు శాతం తక్కువగా..ప్రొటీన్ ఎక్కువగా ఉంటే గొర్రెలో కొవ్వు ఎక్కువగా ప్రొటీన్ తక్కువగా ఉంటుంది.ఐరన్ కూడా మేక లో అధికం. గుండె, కొలెస్ట్రాల్ ఇబ్బందులు ఉన్న వాళ్లు గొర్రె తినకపోవడమే మంచిది. జీర్ణ సమస్యలు ఉన్నవాళ్లకు గొర్రె బెటర్. తలకాయ, కాళ్లు, శాల్తీల విషయంలో ఎవరిష్టం వారిది. తలకాయలు, కాళ్లకూ ఈ మధ్య గిరాకీ పెరిగింది.దీంతో ఐస్‌లో ఎక్కువ రోజులు నిల్వ చేసినవి అమ్మేస్తున్నారు. గొర్రె తలకాయలను మేకవని విక్రయిస్తున్నారు.తేడా తెలుసుకోవడానికి చిన్న లాజిక్ ఉంది. గొర్రె తలకాయలోని కళ్ల కింద చిన్న సొట్టలు ఉంటాయి. మేకకు ఉండవు.

- మటన్‌లో..బోలెడు మోళీలు
- 90 శాతం గొర్రె మాంసమే విక్రయం
- బర్డ్ ఫ్లూతో తగ్గిన చికెన్ వినియోగం
- అమాంతం పెంచేస్తున్న ధరలు
- మొన్నటి వరకూ కిలో రూ.800
- ఇప్పుడు రూ.1300
- ఎక్కువ నిల్వ మాంసమే అమ్మకం
- మామూళ్ల మత్తులో..తనిఖీల్లేవ్
- ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి
- పట్టణాలు.. గ్రామాల్లోనూ ఇంతే
- ప్రజారోగ్యానికి పాతర



చికెన్ తినలేక..!

ఇటీవల బర్డ్ ఫ్లూ కలకలం రేపిన సంగతి తెలిసిందే. దీంతో చికెన్ వినియోగం బాగా తగ్గింది. మార్కెట్‌లో మాంసం అవసరతలో 70 శాతం చికెన్ తీర్చేది. ఇప్పుడు చికెన్ వినియోగం తగ్గడం, చనిపోయిన కోళ్లను, కోళ్ల వ్యర్థాలను చేపలకు ఆహారంగా వేస్తున్నారనే విషయం బయటకు రావడం వల్ల చేపలను తినడానికీ వెనుకాడుతున్నారు. ఈ ప్రభావం మటన్‌పై పడి విపరీతంగా వినియోగం పెరిగిపోయింది. దీంతో ధరలు పెంచేశారు. చికెన్ తినలేక.. మటన్ కొనలేక సామాన్యులు అల్లాడిపోతున్నారు.

గోపాలపురంలో డయేరియా

- 10 గ్రామాల్లో భయం..భయం
- ఇప్పటి వరకూ 30 కేసులు
- మూడు రోజులుగా నమోదు
- ఇంటికి చేరిన 19 మంది
- అప్రమత్తమైన వైద్య సిబ్బంది
- 20 వైద్య బృందాల ఏర్పాటు
- అధికారులతో సీఎం సమీక్ష

గోపాలపురం,మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : గోపాలపురం మండలంలో డయేరియా విజృంభించింది.గడిచిన మూడు రోజుల్లో 10 గ్రామాల నుంచి సుమారు 30 మంది వాంతులు, విరేచనాలతో ఆసుపత్రిలో చేరారు. ప్రతి రోజూ ఎంతో కొంత మంది చేరుతూనే ఉన్నారు. ఇప్పటి వరకూ మండల కేంద్రం గోపాలపురంలో 15 మంది, వేళ్లచింతలగూడెంలో ముగ్గురు, పెద్దాపురంలో ఇద్దరు, వెంకటాయపాలెంలో ముగ్గురు, చిట్యాలలో ఇద్దరు,గుడ్డిగూడెంలో ఇద్దరు, కొవ్వూరుపాడులో ఒక్కరు, తిరుగుడుమెట్టలో ఇద్దరు డయేరియా బారిన పడ్డారు. ఆయా గ్రామాల్లో పొగాకు అధిక సంఖ్యలో సాగవుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా నలుమూలల నుంచి వందల సంఖ్యలో కార్మికులు వలసలు వస్తారు. సుమారు 3 నెలల పాటు పంట పొలాల్లోనే తాటాకు పాకలు వేసుకుని అక్కడే నివాసం ఉంటారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న పంట బోర్ల నుంచి వచ్చిన నీటిని తాగి దాహార్తిని తీర్చుకుంటారు.



వెంకటాయపాలెంలో బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది




కరిచర్లగూడెంలో నీటి నమూనా సేకరణ

మరో పక్క వేసవి కావడంతో వాతావరణంలో మార్పులు.. విపరీతమైన ఎండలు వైద్య సిబ్బంది పరిగణనలోకి తీసుకుంటున్నారు. పొగాకు తోటల్లో పిచికారీ చేసిన పురుగు మందుల అవశేషాల ఘాడత పీల్చడం కూడా దీనికి ప్రధాన కారణం అని వైద్య సిబ్బంది చెపుతున్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో నమోదైన కేసులలో 19 మంది సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి చేరుకోగా మరో ఆరు గురు చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్య ఆరోగ్య శాఖాధికారులు చెబుతున్నారు.

జిల్లా అధికారుల తనిఖీ..

ఆసుపత్రి వర్గాల నుంచి జిల్లా అధికారులకు సమాచారం అందడంతో జిల్లా వైద్యాధికారులు ఆదివారం గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో డయేరియాతో చికిత్స పొందుతున్న వారి వద్దకు హుటాహుటిన వచ్చి బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత మూడు రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా చికిత్స అందించినా ఆదివారం వెలుగులోకి వచ్చింది.దీంతో డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు అన్నదేవరపేట, హుకుంపేట ఆరోగ్య కేంద్రాల వైద్యులను అప్రమత్తం చేశారు. ఆయా గ్రామాల్లో బాధితులు పరిసరాల వద్ద బ్లీచింగ్ పిచికారీ చేసి నీటి నమూనాలను పరీక్షలకు పంపిస్తామని డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు తెలిపారు. డయేరియా బాధితులను ఆదివారం రాత్రి ఆర్డీవో రాణిసుస్మిత, తహశీల్దార్ పరామర్శించి వైద్యులకు పలు సూచనలు చేశారు.

సీఎం చంద్రబాబు ఆరా



గోపాలపురంలో ప్రబలిన డయేరియాపై సీఎం చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. నివారణకు తక్షణ చర్యలు, చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. దీనిపై వైద్యాధికారులు సీఎంకి వివరిస్తూ ఇప్పటికే దాదాపు పది గ్రామాల్లో 20 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. అవసరమైతే అదనంగా డాక్టర్లను నియమిస్తామన్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని, ఎలాంటి ఇబ్బందులు లేవని అధికారులు సీఎంకి వివరించారు.



గోపాలపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితుడితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో
ఆసుపత్రి వైద్యురాలితో మాట్లాడుతున్న ఆర్‌డీవో రాణిసుస్మిత



మైన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న 3 కంప్రెషర్లు,2 టిప్పర్లు

దేచర్లలో మళ్లీ అక్రమంగా మెటల్ తవ్వకాలు

కొవ్వూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు మండలం దేచర్లలో అక్రమార్కుల ఆగడాలు ఆగడంలేదు.. ఎన్నిసార్లు దాడులు చేసినా మళ్లీ మళ్లీ అక్రమాలకు పాల్పడుతూనే ఉన్నారు. కొవ్వూరు మండలం దేచర్ల గ్రామంలోని సర్వే నెంబరు 84 వద్ద మెసర్స్ కేవీఆర్ స్టోన్ క్రషర్ ద్వారా రోడ్డు మెటల్ అక్రమంగా తవ్వుతున్నారని సమాచారం రావడంతో మైన్స్ అధికారులు ఆదివారం తనిఖీలు చేపట్టారు.తనిఖీల్లో అక్రమంగా మెటల్ తవ్వుతున్న 3 కంప్రెషర్లు,2 టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్టు మైన్స్ జిల్లా సహాయ సంచాలకులు డి.ఫణిభూషణ్ రెడ్డి తెలిపారు. సీజ్ చేసిన వాహనాలను సేఫ్ కస్టడీ కోసం కొవ్వూరు పోలీస్ స్టేషన్‌కు తరలించి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు అప్పగించామన్నారు.దాడుల్లో సర్వేయర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజాసమస్యల పరిష్కారవేదిక మీకోసం కార్యక్రమం ఈ వారం కూడా యథాతథంగా జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి పీజీఆర్ఎస్ అర్జీలను స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రత్యేక అధికారులు, జిల్లా , డివిజన్, మండల ,మునిసిపాలిటీల్లో క్షేత్రస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేశారు. అర్జీదారులు సమస్యను బట్టి హాజరై విన్నవించాలని సూచించారు. ఆయా మండల కేంద్రాల్లోనూ పీజీఆర్ఎస్ ఉంటుందన్నారు.

వృద్ధులకు నిత్యావసర సరుకుల పంపిణీ



వాత్సల్య వృద్ధాశ్రమంలో నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొవ్వూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ శివసాయిధామంలోని వృద్ధులు, అంధులకు సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం రూ. 70 వేలు విలువ చేసే నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. శివసాయిధామం సేవా సమితి ఏర్పడి ఐదు సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా సమితి అధ్యక్షుడు కసిరెడ్డి సీతారామయ్య ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా సమితి కార్యదర్శి రెడ్డి తాతయ్యబాబు మాట్లాడుతూ శివసాయిధామం ఆధ్వర్యంలో ప్రతి ఏడాదీ రూ. లక్షను అన్నదానానికి అందించాలని తీర్మానం చేశామన్నారు. నగళ్లపాటి శ్రీనివాస్, కోట్ల సత్యనారాయణ, సీహెచ్ గణేష్, నారా సుబ్రహ్మణ్యేశ్వరరావు , తదితరులు పాల్గొన్నారు.

గౌడల ఆత్మగౌరవాన్ని కాపాడాలి

● సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ తాతా కృష్ణారావు


సమావేశంలో పాల్గొన్న గౌడ సంఘ నాయకులు

కొవ్వూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : గౌడల ఆత్మగౌరవాన్ని కాపాడాలని, అందుకు క్షేత్రస్థాయిలో గౌడ సంఘాల నిర్మాణం జరగాలని ఆ సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ తాతా కృష్ణారావు అన్నారు. పట్టణంలో ఆదివారం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల అధ్యక్షులతో సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో సంఘం గౌరవాధ్యక్షుడు శాస్త్రవేత్త సన్నిబాబు పాల్గొని మాట్లాడుతూ గౌడల సామాజిక భద్రతతో పాటు క్షేత్రస్థాయిలో జనాభా తామాషా పూర్తిస్థాయిలో తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. తాతా కృష్ణారావు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఓటు బ్యాం కుల్లా వాడుకుంటున్నాయని, గౌడలు రాజకీయంగా చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ, మట్టా వీరబాబు, తాళం శ్రీనివాస్, మార్గాని ఆదినారాయణ, బుడ్డిగ అప్పారావు, రేలంగి వెంకట సత్యనారాయణ, బొర్రా కృష్ణారావు, ఏడు నియోజకవర్గాల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

ఉమాచోడేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన


స్వామికి పూజలు నిర్వహిస్తున్న పండితులు

కొవ్వూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతవూరులో వేంచేసియున్న శ్రీ ఉమా చోడేశ్వర స్వామికి ఆదివారం లక్ష బిల్వార్చన చేశారు. పట్టణానికి చెందిన అప్పల అయ్యప్పరాజు, శ్రీరామలత దంపతులు పీఠాలపై కూర్చుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి గణపతిపూజ, మహన్యాస పూర్వక ఏకాదశ వార రుద్రాభిషేకాలు, రుద్రహోమం, అమ్మవారికి శ్రీసూక్త విధానంలో కుంకుమ పూజలు గావించారు. అనంతరం దేవతామూర్తులను విశేష అలంకరణ చేసి నీరాజనమంత్ర పుష్పాలు సమర్పించారు. ఆలయ అర్చకులు కౌతవరపు బాను, దేవరకొండ సాయిప్రసాద్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో కలిగొట్ల కృష్ణారావు, తెన్నేటి సూర్యనారాయణ, పమ్మి రవిబాబు, దామరాజు సచ్చిదానంద, తిప్పాబొట్ల సుబ్రహ్మణ్య శాస్త్రి, చవలి దుర్గాప్రసాద్, గంప కృష్ణారావు, మంత్రిప్రగడ సత్యనారాయణమూర్తి, ముప్పి శ్రీరామచంద్రమూర్తి, కొవ్వూరు పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

'వేగంగా సహకార సంఘాల కంప్యూటరైజేషన్'


కంప్యూటరైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా సహకార సంఘ అధికారి జగన్నాథరెడ్డి

కొవ్వూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు డివిజన్‌లోని 58 సహకార సంఘాలలో కంప్యూటరైజేషన్ ప్రక్రియ వేగంగా జరుగుతుందని జిల్లా సహకార సంఘ అధికారి ఎం. జగన్నాథరెడ్డి తెలిపారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో జరుగుతున్న సహకార సంఘాల కంప్యూటరైజేషన్ ప్రక్రియను ఆదివారం పరిశీలించారు. కొవ్వూరు శ్రీరామా ప్రాథమిక సహకార సంఘం, మండలంలోని కాపవరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు అందించారు. ఈ సందరంగా జగన్నాథరెడ్డి మాట్లాడుతూ కంప్యూటరైజేషన్‌లో డీసీటీ సైన్ ఆఫ్, ప్రీ మైగ్రేషన్ స్టేజ్ రెంటినీ జిల్లాలో 107 సంఘాలు పూర్తి చేశాయన్నారు. డివిజనల్ సహకార అధికారి వి. కృష్ణకాంత్, సొసైటీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరి జలాలకు రూ.110 కోట్లు

● జలజీవన్ మిషన్ కింద ప్రభుత్వానికి ప్రతిపాదన ● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు వెల్లడి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే


హాజరైన ప్రజాప్రతినిధులు

కొవ్వూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు నియోజకవర్గంలోని ప్రజలకు గోదావరి జలాలను అందించడానికి జలజీవన్ మిషన్ కింద రూ. 110 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కాకర్ల నారాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.3.66 కోట్లతో రైతులు పండించిన పంటను బయటకు తరలించడానికి పుంతరోడ్ల పనులు చేపట్టడం జరిగిందన్నారు.ఇంకా ఏమైనా మిగిలి ఉన్నట్టయితే ప్రతిపాదనలు సిద్ధం చేసి పూర్తిచేయడం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా గ్రామ సర్పంచ్‌లు, పంచాయితీ సెక్రటరీలు బాధ్యత వహించాలన్నారు.గత ప్రభుత్వంలో చేపట్టిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు మంజూరుకు కృషిచేస్తానన్నారు. 2027లో గోదావరి పుష్కరాల నాటికి కొవ్వూరు పట్టణం, మండలంలోని అన్ని గ్రామాలను 100 శాతం అభివృద్ధి చేస్తామన్నారు. చిడిపి సర్పంచ్ పాలడుగుల లక్ష్మణరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన గ్రామ సచివాలయాలు, విలేజ్‌క్లినిక్‌లు, ఆర్‌బీకే భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయని, వాటికి నిధులు మంజూరుచేసి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పెనకనమెట్ట సర్పంచ్ మేకల శ్రీనివాస్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేపట్టిన రీసర్వేతో రైతుల భూములకు సంబంధించి ఇచ్చిన ఎల్‌పీ నెంబర్లను రద్దు చేయాలని కోరారు. ఎంపీటీసీ యలమర్తి శ్రీరాంప్రసాద్ మాట్లాడుతూ దొమ్మేరు సావరానికి మంజూరైన తాగునీటి మోటారును వేసవి దృష్ట్యా త్వరితగతిన ఏర్పాటుచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె. సుశీల, తహశీల్దార్ ఎం. దుర్గాప్రసా ద్, జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ వీరమళ్ల నారాయుడు, సర్పంచ్‌లు, ఎం పీటీసీలు, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.

'కొవ్వూరు పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం'

కొవ్వూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని 10వ వార్డులో మేజర్ డ్రైనేజీపై కవర్‌శ్లాబ్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోదావరి పుష్కరాల నాటికి పట్టణాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ప్రధానంగా సీసీ రోడ్లు,డ్రైనేజీ పనులు పూర్తిచేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. దానిలో భాగంగా మేజర్ డ్రైనేజీపై ఉన్న కవర్‌శ్లాబ్‌లు పాడైపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్ సూచన మేరకు మున్సిపల్ నిధులు రూ. ఐదు లక్షలు కేటాయించి కవర్ శ్లాబ్‌లు వేస్తున్నామన్నారు. చైర్‌పర్సన్ రత్నకుమారి మాట్లాడుతూ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. అలాగే విద్యుత్‌దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరాపై మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక దృష్టిసా రించిందన్నారు. సూరపనేని చిన్ని, కౌన్సిలర్లు బత్తి నాగరాజు, పిల్లలమర్రి మురళీకృష్ణ, బోడపాటి ముత్యాలరావు, బర్ల శ్రీనివాస్, జొన్నలగడ్డ శ్రీనివాస్, మున్సిపల్ ఏఈలు సుమంత్, సందీప్, పారిశుధ్య మేస్త్రీ రాజాన అప్పారావు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



నిడదవోలు పట్టణ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

నిడదవోలు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణం, మండలంలో 10వ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఎంఈవో గురుమూర్తి తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, సెయిం ట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మున్సిపల్ హైస్కూల్ నెం.3, నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్, మండలంలోని పురుషోత్తపల్లిలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్, సమిశ్రగూడెంలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్, తాడిమళ్ల జిల్లా పరిషత్ హైస్కూల్, కోరుమామిడి జిల్లా పరిషత్ హైస్కూల్... మొత్తం తొమ్మిది కేంద్రాలలో 1525 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరుకానున్నారని ఎంఈవో తెలిపారు.

తాళ్లపూడి: మండలంలో సోమవారం నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభమవుతాయని రూట్ ఆఫీసర్ ఎంఈవో సీహెచ్ సెహ్రూజీ తెలిపారు. మండలానికి చెందిన 765 మంది విద్యార్థులు హాజరవుతారని చెప్పారు. ఎగ్జామినర్‌గా జె. ప్రభాకర్, వీవోగా జీ. సత్యనారాయణ వ్యవహరిస్తారన్నారు. పరీక్షల చీఫ్‌గా సీహెచ్ నాగేంద్ర, సుబ్బలక్ష్మి, డీవోలుగా కే.రాధిక, మోహన్ విధులు నిర్వహిస్తారని తెలిపారు.

చాగల్లు: పదవ తరగతి పరీక్షలకు మండలం నుంచి 597 మంది హాజరుకానున్నట్టు ఎంఈవో యు గురునాథం తెలిపారు. మండలంలోని 7 ప్రైవేట్ పాఠశాలల నుంచి 148 మంది పరీక్షలకు హాజరవుతుండగా, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 449 మంది ఉన్నారని చెప్పారు. వీరికి చాగల్లు హైస్కూల్, ఊనగట్ల హైస్కూల్, మార్కొండపాడు హైస్కూల్ కలిపి మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు.

గోపాలపురం: పదోతరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్టు మండల విద్యాశాఖాధికారి జి. శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వేళ్లచింతగుడెం సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, రాజపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్, దొండపూడి సెయింట్‌మేరీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పరీక్షల నిర్వహణకు అనుమతి లభించిందన్నారు. ఈ సంవత్సరం 956 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారన్నారు.

నల్లజర్ల : పదోతరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్టు ఎంఈవో సత్యనారాయణ తెలిపారు.ఉదయం 8.30 గంటలకే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అనంతపల్లి, పోతవరం, దూబచర్ల, నల్లజర్ల హైస్కూల్స్‌తోపాటు నల్లజర్ల శశి స్కూల్‌లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఈ కేంద్రాల్లో 1080 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు.

అట్టలు, పెన్నుల పంపిణీ


ధర్మవరంలో అట్టలు అందించిన దృశ్యం

కొవ్వూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ధర్మవరం జడ్పీ హైస్కూల్లో 10వ తరగతి పరీక్షలు రాస్తున్న 19 మంది విద్యార్థులకు ఆదివారం మెటీరియల్ పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ నేరేడుమిల్లి నాగమణి ఆధ్వర్యంలో ఒక్కొక్క విద్యార్థికి రూ. 250 విలువైన పరీక్ష ప్యాడ్, పెన్ను, పెన్సిల్, స్కేలు, కంపాస్ బాక్స్‌తో కూడిన కిట్‌ను అందజేశారు. పంచాయతీ కార్యదర్శి కోనే హేమలత, పాఠశాల ఉపాధ్యాయులు కొయ్యల ప్రసాద్, ఉప సర్పంచ్ వెంపాటి యుగంధర్, గారపాటి వెంకటకృష్ణ, నేరేడుమిల్లి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

నల్లజర్ల, మార్చి16 (ఆంధ్రజ్యోతి): అనంతపల్లి షిర్డీసాయి బాబా ఆలయం 27వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రెండోరోజు ఆదివారం ఆలయంలో బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు సత్యనారాయణ శాస్త్రి, ప్రతాప సాయి శర్మచే గణపతి పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, మండపారాధన, హోమాన్ని జరిపారు. కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

చిడిపిలో కుల బహిష్కరణ సమస్య పరిష్కారం

● ఆర్డీవో డాక్టర్ రాణీసుస్మిత


కరచాలనం చేసుకుంటున్న రజక, గౌడ కులస్థులు

కొవ్వూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): చిడిపిలో కుల బహిష్కరణ సమస్య పరిష్కారమైనట్టు కొవ్వూరు ఆర్డీవో డా. రాణీ సుస్మిత తెలిపారు. ఆదివారం రజకులు, గౌడ సంఘ సభ్యులతో జరిపిన చర్చలు ఫలించాయన్నారు. ఇరువర్గాలు శాంతియుతంగా కలిసి జీవించడానికి కొన్ని నిబంధనలకు అంగీకరించారు. దీంతో పరస్పర అవగాహనతో ఒక తీర్మానం చేసుకుని సభ్యుల సంతకాలు చేసి తమ అంగీకారాన్ని తెలియజేశారు. అంగీకార పత్రంపై సంతకాలు చేసి అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో కొవ్వూరురూరల్ ఎస్ఐ కె. శ్రీహరిరావు, చిడిపి గ్రామ సర్పంచ్ పాలడుగుల లక్ష్మణరావు, మంకెన వీరన్న రజక, గౌడ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వీడని మంచు తెరలు


నిడదవోలులో కురుస్తున్న మంచు

నిడదవోలు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మార్చిలోనూ మంచు తెరలు వీడటం లేదు. ఉదయం పూట మంచు... ఆ తరువాత ఎండ వేడిమి తగ్గడం లేదు. దీంతో జనాలు బెంబేలెత్తిపోతున్నారు. ఆదివారం నిడదవోలు పట్టణంలో ఉదయం తొమ్మిది గంటల వరకు ఇలా మంచు కురుస్తూనే ఉంది.

బీజేపీ ఐదో మండల కమిటీ ఏకగ్రీవం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా రాజమహేంద్రవరం సిటీలోని 5వ మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైందని జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తెలిపారు. ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా కమలేష్‌కుమార్ జైన్, ఇతర కమిటీ ఎన్నికైందని తెలిపారు. నూతన కమిటీ బీజేపీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆయన కోరారు. ఎన్నికల అధికారి ప్రసాద్, లలిత్‌కుమార్ జైన్, కురగంటి సతీష్, అమలాపురం ఇన్‌ఛార్జి రామ్మోహనరావు, రొంగల గోపి, పిల్లాడి రుద్రయ్య పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటేశ్వర నగర్ ఆధ్వర్యంలో డాక్టర్ వలేపల్లి రామకృష్ణ ప ర్య వేక్షణలో ఆరోగ్యంపై అవగాహన సద స్సు నిర్వహించారు. వృద్ధాప్యంలో వచ్చే ఆరోగ్య సమస్యలు, వాటికి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. డాక్టర్ రామకృష్ణను క్లబ్ సభ్యులు సత్కరించారు.

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది

● 'అమరజీవి' జయంతి సభలో మంత్రి కందుల దుర్గేష్


నిడదవోలు పట్టణంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర అవతరణకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం నిడదవోలు పట్టణంలోని గాంధీబొమ్మ సెంటరులో ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద 124వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలు ఉన్నంతకాలం అమరజీవి అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. కార్యక్రమంలో చైర్మన్ భూపతి ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, జనసేన నాయకులు రంగారమేష్, డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, బచ్చునాని పాల్గొన్నారు.

● టీడీపీ కార్యాలయంలో ...

పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ, ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాద్, గోవా కృష్ణ, అజీజ్ బాషా, తదతరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: మండల కేంద్రంలోని కల్యాణ మండపం వద్ద అమరజీవి పొట్టిశ్రీరాములు 124వ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీకాకుళపు కాశీకృష్ణ, ఆర్యవైశ్య సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాశీకృష్ణ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం కోసం ఆయన ప్రాణాలను పణంగా పెట్టారని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు కొత్తగుండి బాబూరావు, వెలగా సాంబశివరావు, సుతాపల్లి రామారావు, నూలు రమణ, కొత్త సత్యనారాయణ, చిరువూరి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని స్థానిక బస్టాండ్ సెంటరులో గల వాసవీ కన్యకాపర మేశ్వరి ఆర్యవైశ్య సత్రం వద్ద గల మహాత్మాగాంధీ, పొట్టిశ్రీరాములు విగ్రహాలకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సంఘ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు యండపల్లి శేఖర్, గ్రామ ఉపసర్పంచ్ అప్పన జగదీష్, గోకవరపు మాణిక్యం, కంకిపాటి శివ, అప్పన భవ్యధరణి, సూరిబాబు, కడలి కిరణ్, రాజా, తదితరులు పాల్గొన్నారు.


దేవరపల్లిలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

కోటసత్తెమ్మకి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నిడదవోలు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తిమ్మరాజుపాలెంలో వేంచేసి ఉన్న కోట సత్తెమ్మ వారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు గావించారు. అనంతరం క్షీర, మహానివేదన చేశారు. దీనిలో భాగంగా అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారికి ఆదివారం ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి భక్తులు తరలి రావడంతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ చర్యలు చేపట్టింది. ప్రత్యేక దర్శనం ద్వారా రూ.30,160, అన్నదాన విరాళాల ద్వారా రూ. 4248, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ. 25,675, పూజా టికెట్లు, ఇతర టికెట్ల ద్వారా రూ.48,218, దాతలు అందించిన విరాళాల ద్వారా రూ. 32,500.... మొత్తం రూ. 1,40,796 ఆదాయం లభించినట్టు దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి.హరిసూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు.

మెగా వైద్య శిబిరానికి స్పందన


ప్రక్కిలంకలో రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

తాళ్లపూడి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రక్కిలంకలో ఇటీవల నూతనంగా నిర్మించిన అశోక్ మల్టీస్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. దీనికి భారీ సంఖ్యలో రోగులు వచ్చారు. పలు గ్రామాల నుంచి దాదాపు 200 మంది వరకు వచ్చి వైద్యసేవలు పొందారు. డాక్టర్ అశోక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో అరుదుగా లభించే ఖరీదైన వైద్యసేవలను ఉచితంగా అందచేయడం ద్వారా పదిమందికి సేవ చేసినట్టు అవుతుందన్నారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ కిషోర్, ఆర్థోపెడిక్ డాక్టర్ అమూల్య మాట్లాడుతూ ఈ శిబిరంలో ఏర్పాటు చేసిన ఎముకల సాంద్రత తెలిపే యంత్రాలతో ఎముకలలో ఎంత కాల్షియం శాతం ఉందో పరీక్షలు చేశామన్నారు. మందులను కూడా ఉచితంగా అందించారు.

ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి..

కంటైనర్ బోల్తా


జాతీయ రహదారిపై పడిపోయిన కంటైనర్

గోపాలపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వస్తు న్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి కంటైనర్ లారీ బోల్తా పడిన సంఘటన గోపాలపురంలో ఆదివారం చోటుచే సుకుంది. హైదరాబాద్ నుంచి భువనేశ్వర్ వైపు కోడిగుడ్ల లోడుతో వెళుతున్న కంటైనర్ మార్గమధ్యలోని గోపాలపురం జాతీయ రహదారిపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు.

అక్రమంగా చెట్లు నరికివేత


దేవరపల్లి, పోలవరం కాల్వ వద్ద నరికేసిన చెట్లు

దేవరపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తాడిపూడి, పోలవరం గట్లపై ఉన్న చెట్లను అక్రమార్కులు అడ్డంగా నరికేస్తున్నారు. పలుమార్లు కలప తరలించే వ్యక్తులను పట్టుకుని పోలీస్ స్టేషన్లకు అప్పగించినా అడ్డుకట్ట పడటం లేదు. పోలవరం గట్లపై ఉన్న వేప, పలురకాల జాతిచెట్లను నరికి వేసి గుట్టుగా దూరప్రాంతాలకు తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు తహశీల్దార్ శ్రీనివాసరావు సంఘటనా ప్రాంతానికి వెళ్లడంతో కూలీలు పరారయ్యారు. దీనిపై తహశీల్దార్ మాట్లాడుతూ చెట్లను అక్రమంగా నరికివేస్తే అట్టివారిపై చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఈయనతో సిబ్బంది, తదితరులున్నారు.

నల్లజర్లలో చోరీ


చోరీ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నల్లజర్ల, మార్చి16 (ఆంధ్రజ్యోతి): నల్లజర్లలో మాదుగుల శ్రీనివాస్ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఇంటి వెనుక తలుపులు పగులగొట్టి 22 కాసుల బంగారు ఆభరణాలు, రెండు తులాల వెండిని దుండగులు అపహరించుకుపోయినట్టు బాధితుడు తెలిపాడు. ఈ మేరకు నల్లజర్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.